

అర్ధరాత్రి చిందులు

» తీర ప్రాంత అతిథి గృహాల్లో రేవ్ పార్టీలు

» అమ్మాయిలతో డ్యాన్స్‌లు.. పోలీసుల దాడులు

» అధికార పార్టీ నేతల నుంచి ఒత్తిళ్లు

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

జిల్లాలోని సముద్రతీర ప్రాంతంలో అతిథి గృహాల వేదికగా రేవ్ పార్టీలు జోరందుకున్నాయి. యువతను ఆకర్షించేందుకు ఇతర ప్రాంతాల నుంచి యువతులను రప్పించి అర్ధరాత్రి చిందులు వేస్తున్నారు. కొంత కాలంగా ఇటువంటి పార్టీలు సాగుతున్నాయి. సముద్ర తీర ప్రాంతంలోని తోటల్లో ఎన్నో అతిథి గృహాలు వున్నాయి. ఇవి ప్రకృతి అందాలతోపాటు చల్లదనంతో అలరారుతుంటాయి. వీటిల్లో సేద తీరేందుకు ఇతర ప్రాంతాల నుంచి పర్యాటకులు వస్తుంటారు. ఇప్పుడు ఇలాంటి అతిథి గృహాల్లో కొన్ని క్యాబరే డ్యాన్స్‌లకు కేరాఫ్‌గా మారుతున్నాయి. నెల క్రితం ఓ వర్గానికి చెందిన యువకులు యువతులను రప్పించి చిందులు వేశారు. పోలీసులు వెళ్లి అడ్డుకుంటే అధికార పార్టీకి చెందిన ఓ నేత ఫోన్ చేయడంతో వదిలి వెళ్లిపోయారు !. ఇది తెలుసుకున్న మరో వర్గం తర్వాత రేవ్ పార్టీ పెట్టి చిందులు వేసింది. ఇది తెలిసి అధికారులు వెళ్లి అడ్డుకునే ప్రయత్నం చేశారు. దీంతో వారు ఎదురు తిరిగి మొన్న వేరే వారిని విడిచిపెట్టారు కదా..! అంటూ రుసరుసలాడారు. దీంతో వారు ఏమీ చేయలేక వెనుదిరిగినట్టు సమాచారం. ఇలా తీర ప్రాంతంలో రెండు వర్గాలకు చెందిన యువకులు అర్ధరాత్రి పార్టీల్లో పోటీ పడ్డారు. ఈ పార్టీలో అధికార మండల పార్టీ అధ్యక్షుడు భాగస్వామి అవుతుండడంతో గుట్టుచప్పుడు కాకుండా క్లబ్ డ్యాన్స్‌లు వేస్తున్నారు. ఓ వర్గం యువకులకు నియోజకవర్గంలో అధికారాన్ని చెలాయించే నేత అండ ఉంది. దీనిని ఆసరాగా చేసుకుని కొందరు యువకులు సరదాలకు, జల్సాలకు పోతున్నారు. ఇప్పటి వరకు పశ్చిమ గోదావరి జిల్లాలో పేకాటలు జోరుగా సాగేవి. వీటిపై ప్రభుత్వం సీరియస్ కావడంతో అవి కొంత వరకు కట్టడి అయ్యాయి. తాజాగా తీర ప్రాంతంలోని ప్రైవేటు అతిథి గృహాలు రేవ్ పార్టీలకు వేదికలుగా మారడంతో పెద్ద చర్చే నడుస్తోంది.

లంచం తీసుకున్న లైన్‌మన్‌కు షాక్

» ఏడాది జైలు శిక్ష విధిస్తూ ఏసీబీ కోర్టు తీర్పు



ఏలూరు క్రైం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి):వ్యవసాయ భూమిలో వేసిన బోర్‌వెల్‌కు ఎలక్ట్రికల్ కనెక్షన్ ఇవ్వడానికి లైన్‌మన్ రూ.ఐదు వేలు లంచం తీసుకున్నట్టు నేరం రుజువు కావడంతో అతనికి ఏడాది జైలు శిక్ష, రూ.రెండు వేలు జరిమానా విధిస్తూ రాజమహేంద్రవరం ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానం శుక్రవారం తీర్పుచెప్పింది. ఏలూరు జిల్లా భీమడోలు మండలం పోలసానపల్లికి చెందిన కనుకుంట మురళీకృష్ణ అతని మామ తూమాట అజయ్ కుమార్‌లకు ఉన్న వ్యవసాయ భూమిలో బోరు వెల్ వేశారు. దానికి కనెక్షన్ ఇవ్వడానికి 2010లో భీమడోలు ఎలక్ట్రికల్ ఆఫీస్‌కు చెందిన లైన్‌మన్ డి.మాణిక్యాలరావు వారిని రూ.ఐదు వేలు లంచం డిమాండ్ చేయగా వారు ఏలూరు అవినీతి నిరోధక శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఏసీబీ అధికారులు 2010 మార్చి 31న లంచం తీసుకుంటున్న మాణిక్యాలరావును రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని అరెస్టు చేశారు. అప్పటి నుంచి ఈ కేసు రాజమహేంద్రవరం ప్రత్యేక న్యాయస్థానంలో విచారణ జరగ్గా మాణిక్యాలరావుపై నేరం రుజువు కావడంతో ఏడాది కఠిన కారాగార శిక్ష, రూ.రెండు వేలు జరిమానా విధిస్తూ శుక్రవారం కోర్టు తీర్పు ఇచ్చింది.

విద్యా సంస్థల బస్సుల్లో లోపాలను సవరించాలి

» ఉప రవాణా కమిషనర్ షేక్ కరీం

ఏలూరు క్రైం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి):విద్యా సంస్థల బస్సుల్లో భద్రతా లోపాలను తక్షణమే సవరించాలని, నిబంధనల మేరకు లేని వాహనాలను సీజ్ చేసి, సంబంధిత యజమానులపై కేసులు నమోదు చేస్తామని ఉప రవాణా కమిషనర్ షేక్ కరీం హెచ్చరించారు. ఏలూర నగరంలోని విద్యా సంస్థల బస్సు డ్రైవర్లు, ప్రతినిధులతో చొదిమెళ్ళలోని రవాణాశాఖ కార్యాలయంలో డీటీసీ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని విద్యాసంస్థల బస్సుల్లోని భద్రతా లోపాలను ఈనెల 10వ తేదీలోగా సవరించుకోవాలన్నారు. ఈనెల 11వ తేదీ నుంచి వాహన తనిఖీ అధికారులు ప్రతి పాఠశాల, కళాశాల బస్సులను క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహిస్తారన్నారు.

నూజివీడు సబ్ డివిజన్ పరిధిలో పోలీస్ యాక్టు 30 అమలు

ఏలూరు క్రైం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): నూజివీడు సబ్ డివిజన్ పరిధిలోని పెదపాడు, పెదవేగి, దెందులూరు పరిధిలో పోలీస్ యాక్టు 30 విధించినట్టు నూజివీడు డీఎస్పీ కేవీవీఎస్‌వీ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. పోలీస్ యాక్టు అమలులో ఉన్న దృష్ట్యా ఈ మూడు పోలీస్ స్టేషన్ల పరిధిలో సమావేశాలు, సామూహిక నిరసనలు, ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహించకూడదని ఒక వేళ నిర్వహించాలంటే ముందస్తుగా పోలీసు అనుమతి పొందాలన్నారు.



ప్రైవేటు ఆలయాల్లో.. భద్రత ఎంత?

» కాశీబుగ్గ తొక్కిసలాట ఘటనతో ప్రభుత్వం అప్రమత్తం

» జిల్లాలో దేవదాయశాఖ అధికారులు, ఇన్‌స్పెక్టర్లు ఆరా

» నెలాఖరు నాటికి తుది నివేదిక సిద్ధం

జిల్లాలో ప్రైవేట్ ఆలయాల నిర్వహణ, భద్రతపై దేవదాయ, ధర్మదాయశాఖ అధికారులు ఆరా తీస్తు న్నారు. ఇటీవల శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గ వేంకటేశ్వ రస్వామి ఆలయంలో జరిగిన తొక్కిసలాటలో తొమ్మిది మంది దుర్మరణం చెందిన విషయం విదితమే. ఈ ఘటనపై సీరియస్‌గా ఉన్న దేవదాయ శాఖ ప్రైవేట్ వ్యక్తుల నిర్వహణలోని ఆలయాల్లో భద్రత పెంచే విషయంలో కఠినంగా వ్యవహరించాలని నిర్ణయించింది. ప్రతీ జిల్లాలో అటువంటి ఆలయాల సమాచారాన్ని సేకరించాలని ఆదేశాలు జారీ చేసింది.

(ఏలూరు-ఆంధ్రజ్యోతి)

జిల్లా వ్యాప్తంగా భక్తిభావం పెరిగింది. దాతల వితరణ శక్తి పెరిగిందివివిధ జాతరలు, ఉత్సవాల పేరిట ఏదో మూల దేవాలయాల్లో ప్రత్యేక ఆరాధనలు జరుగుతుంటాయి. ప్రధానంగా దాతలు, భక్తులు సేకరించిన విరాళాలతో దేవాలయాలను నిర్మించిన ఘటనలు కోకొల్లలు. మరోవైపు కాల్వగట్లు, ఏటిగట్లు ప్రాంతంలో ఇష్టారాజ్యంగా వెలిసినవి ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా దేవదాయశాఖ పరిధిలో దేవాలయాలు, సత్రాలు, మఠాలు కలుపుకుని 716 ఉన్నాయి. వీటి నిర్వహణను కూటమి ప్రభుత్వం గాడిలో పెట్టింది. సీసీ కెమెరాల నిఘాను విస్తరించడం, సిబ్బంది పెంపు, ఆలయాల్లో అర్చకులు వేతనాలు పెంపును చేపట్టింది.

ఉత్సవాలపై నిఘా

జిల్లా దేవదాయశాఖ ఆధ్వర్యంలో ప్రైవేట్ దేవాలయాల వివరాలు లేదు. మరోవైపు ప్రముఖ దేవాలయాలుగా విరాజిల్లుతున్న ప్రైవేట్ ఆలయాల్లో కనీసం వెయ్యి మంది పైగా భక్తులు వచ్చే వాటి వివరాలకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు. ఆలయాల డేటా లేకపోవడంతో సచివాలయ సిబ్బంది ఆధారంగా దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్లు, ఇతర సిబ్బంది జల్లెడ పడుతున్నారు. ప్రభుత్వ దేవాలయాల మాదిరిగానే క్యూలైన్లు, సీసీ కెమెరాల పర్యవేక్షణ, విశాలమైన ప్రహరీలు, సిబ్బంది నియామకం జరిగేలా ప్రభుత్వ విధి, విధానాలు రూపొందించే అవకాశం ఉన్నట్టు సమాచారం. ఏయే ఆలయాల్లో ప్రత్యేక ఉత్సవాలు, బ్రహోత్సవాలు జరుగుతాయో వాటి వివరాలను రికార్డు చేస్తున్నారు. ఈ నెలాఖరు నాటికి పూర్తి స్థాయిలో దేవాలయాల సంఖ్యను నిర్ధారించే అవకాశం ఉందని జిల్లా దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ కూచిపూడి శ్రీనివాస్ తెలిపారు.



ర్యాలీలో పాల్గొన్న డీఎంహెచ్‌వో అమృతం, తదితరులు

క్యాన్సర్ స్క్రీనింగ్ టెస్టులకు ప్రాధాన్యం ఇవ్వాలి : డీఎంహెచ్‌వో

ఏలూరు అర్బన్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి):బీపీ, సుగర్ పరీక్షలు చేయించుకోవడానికి ఇస్తున్న ప్రాధాన్యతనే క్యాన్సర్ పరీక్షలకు ఇస్తే ముందస్తు నివారణ, నియంత్రణ సాధ్యమేనని డీఎంహెచ్‌వో డాక్టర్ పీ.జే.అమృతం పేర్కొన్నారు. జాతీయ క్యాన్సర్ అవగాహన దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం జిల్లా వైద్యఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఏలూరులో నిర్వహించిన ర్యాలీలో ఆమె మాట్లాడుతూ పొగతాగడం, మద్యపానం, అసమతుల్య ఆహారం, వ్యాయామం లేకపోవడం క్యాన్సర్ ప్రధాన కారకాలని వివరించారు. స్క్రీనింగ్ పరీక్షలతోనే క్యాన్సర్‌పై విజయం సాధించగలమన్నారు. జిల్లాలలోని అన్ని గ్రామ/వార్డు సచివాలయాలపరిదిలో ప్రజలందరికీ క్యాన్సర్‌పై అవగాహన కోసం విస్తృత ప్రచారాన్ని చేపట్టినట్టు వివరించారు. జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ శోభ, ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సావిత్రి, వైస్‌ప్రిన్సిపాల్ డాక్టర్ శశిధర్, ఆర్బీఎస్కే జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ నరేంద్ర, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, వైద్యాధికారులు, వైద్యవిద్యార్థులు, ఆరోగ్యసిబ్బంది పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు : కలెక్టర్

ఏలూరుసిటీ, నవంబరు 7(ఆంధ్రజ్యోతి):విధుల పట్ల నిర్లక్ష్యం, నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయని అధికారులను ఉపేక్షించేది లేదని, వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులను హెచ్చరించారు. జిల్లాలోని సంక్షేమ నవతి గృహాల్లో, అంగన్‌వాడీ కేంద్రాలు, పర్యాటక శాఖకు చెందిన ప్రదేశాల్లో టాయిలెట్లు నిర్మాణ పనులపై ఆర్‌డబ్ల్యుఎస్, సంక్షేమ శాఖల అధికారులతో శుక్రవారం జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ సమీక్షించారు. జిల్లాలోని సంక్షేమ వసతి గృహాలకు టాయిలెట్లు మంజూరు చేసి మూడు నెలలు దాటినా ఇంకా టాయిలెట్లు నిర్మించకపోవడంతో ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. టాయిలెట్లు నిర్మాణంలో రెండు నెలల నుంచి ఎటువంటి పురోగతి కనిపించని కామవరపుకోట, జీలుగుమిల్లి, కైకలూరు, ముదినేపల్లి, పోలవరం, కలిదిండి మండలాల ఆర్‌డబ్ల్యుఎస్ అధికారుల పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ 24 గంటల లోగా పనులలో పురోగతి ప్రదర్శించని సంబంధిత అధికారులను సస్పెండ్ చేస్తానని హెచ్చరించారు. కాన్ఫరెన్స్‌లో సీపీవో వాసుదేవరావు, సంక్షేమశాఖల అధికారులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతికూల వార్తలపై అధికారులు స్పందించాలి..

ఏలూరు,నవంబరు 7(ఆంధ్రజ్యోతి):పత్రికల్లో వచ్చే ప్రతికూల వార్తాంశాలపై అధికారులు వెంటనే స్పందించి పరిష్కార చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. జిల్లా అధికారులతో పరిష్కార చర్యలపై ఆమె శుక్రవారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. శాఖల కార్యకలాపాలపై ప్రతీరోజూ ప్రతికూల అంశాలపై వచ్చిన వాటిపై క్షేత్ర స్థాయిలో తీసుకున్న చర్యలను, స్పందనలను సమర్పించాలన్నారు.

కందిపప్పు సొమ్ము రికవరీపై జేసీ ఆరా..

» సొమ్ము చెల్లిస్తున్న రేషన్ డీలర్లు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కుక్కునూరు,నవంబరు 7(ఆంధ్రజ్యోతి):కుక్కునూరు, వేలేరుపాడు మండలంలోని పలువురు ప్రైవేటు రేషన్ డీలర్లు కందిపప్పు అమ్మినా దాదాపు రూ.12 లక్షలు ప్రభుత్వ ఖజానాకి జమ చేయలేదు. దీనిపై శుక్రవారం 'ఆంధ్రజ్యోతి'లో 'కందిపప్పు సొమ్ము రికవరీ ఎప్పుడు?' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనిపై జిల్లా జాయింట్ కలెక్టర్ ఎంజే అభిషేక్ గౌడ కందిపప్పు సొమ్ము రికవరీపై ఆరా తీసినట్టు సమాచారం. దీంతో అప్రమత్తమైన పలువురు రేషన్ డీలర్లు హడావిడిగా సొమ్మును చెల్లిస్తున్నారు. ఒక ప్రైవేటు డీలరు సుమారు రూ.17వేలు సొమ్ము చెల్లించినట్టు తెలిసింది.



ముదినేపల్లి మండలం గురజ వద్ద డెక్కతో నిండిన నాన్ - నోటిఫైడ్ ఇసుక కాల్వ

వీటి సంగతి ఇంతేనా?

ప్రధాన కాల్వల నుంచి పొలాలకు సాగు నీరు, పొలాల నుంచి మీడియం డ్రెయిన్లకు మురుగునీటిని సరఫరా చేస్తున్న బ్రాంచి పంట కాల్వలు, మైనర్ డ్రెయిన్లు ఏళ్ల తరబడి అభివృద్ధికి నోచుకోవడం లేదు. వీటిలో ప్రభుత్వం నోటిఫై చేసిన కాల్వల అభివృద్ధి నిర్వహణ కొంతవరకు జరుగుతున్నా నాన్ నోటిఫైడ్ కాల్వలు పూర్తిగా నిర్లక్ష్యానికి గురవుతున్నాయి. వాటి అభివృద్ధికి నిధులు మంజూరు కావడం లేదు.

అభివృద్ధికి నోచుకోని నాన్ నోటిఫైడ్ కాల్వలు

» మంజూరు కాని నిధులు.. తవ్వకాలు నిల్

» జిల్లాలో మొత్తం 233 నాన్ నోటిఫైడ్ మురుగు కాల్వలు.. సుమారు 300 నాన్ నోటిఫైడ్ పంట కాల్వలు

ముదినేపల్లి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ గుర్తింపు లేక నాన్ నోటిఫైడ్ కాల్వలు అభివృద్ధికి నోచుకోకపోవడంతో సాగునీటి సమస్య ఎదురవుతోంది. కాల్వల అభివృద్ధి నోటిఫై అయిన భాగంలోనే జరుగుతుందే తప్ప నాన్ నోటిఫైడ్‌గా ఉన్న కింది భాగంలో తవ్వకాలు, గుర్రపు డెక్క తొలగింపు పనులు జరగడం లేదు. పంట, మురుగు కాల్వల్లో ఇసుక, మట్టి మేట వేసుకుపోయేది కింది భాగంలోనే ఎక్కువ. నోటిఫై కాకపోవడంతో ఆయా శాఖల అధికారులు ఏ చర్యలు తీసుకోకపోవడంతో శివారు ఆయకట్టు భూములకు నీరు అందదు... ముంపు తప్పదు అన్న చందంగా పరిస్థితి ఉంది. గతంలో టీడీపీ ప్రభుత్వం నీరు - చెట్టు పథకం కింద నాన్ - నోటిఫైడ్ డ్రెయిన్లు, పంట కాల్వల అభివృద్ధికి నిధులు మంజూరు చేయగా, 2019 నుంచి వైసీపీ ప్రభుత్వ హయాంలో ఈ కాల్వలు నిర్లక్ష్యానికి గురయ్యాయి. జిల్లాలో మొత్తం 233 నాన్ నోటిఫైడ్ మురుగు కాల్వలు ఉన్నాయి. సుమారు 300 నాన్ నోటిఫైడ్ పంట కాల్వలు ఉన్నాయి.

కైకలూరు నియోజకవర్గంలో..

కైకలూరు నియోజకవర్గంలోని ముదినేపల్లి, కలిదిండి, మండవల్లి, కైకలూరు మండలాల్లో సుమారు 80 నాన్ నోటిఫైడ్ డ్రెయిన్లు ఉండగా సుమారు వంద పంట కాల్వలు ఉన్నాయి. వీటి అభివృద్ధికి గత వైసీపీ ప్రభుత్వం నిధులు మంజూరు చేయకపోవడంతో రైతులే స్వచ్ఛందంగా తవ్వుకోవడం, గుర్రపు డెక్క తొలగింపు పనులను నిర్వహించుకున్నారు. పలుచోట్ల నాన్ - నోటిఫైడ్ కాల్వలు చేపలు, రొయ్యల చెరువుల్లో కలసిపోయి కనుమరుగైపోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు.



అభివృద్ధికి నోచుకోని పెదగొన్నూరు న్యూ ఛానల్

ఆయకట్టు స్థిరీకరణ లేకపోవడంతో..

పంట కాల్వల వారీగా సాగు ఆయకట్టు విస్తీర్ణం జరగపోవడంతో నాన్ - నోటిఫైడ్ బ్రాంచి కాల్వలను ప్రభుత్వం నోటిఫై చేసే అవకాశం లేకుండా పోయింది. రెవెన్యూ, ఇరిగేషన్, డ్రెయినేజీ శాఖ అధికారులు జాయింట్ పరిశీలన ద్వారా పదేళ్లకు ఒకసారి ఆయకట్టు స్థిరీకరణ చేయాలి. ఈ ప్రక్రియను నిర్వహించడమే ఆపేశారు. ఆయకట్టు - మిగతా 8వ పేజీలో

ఎన్‌ఆర్‌ఈజీఎస్‌లో చేర్చాలి



నాన్-నోటిఫైడ్ పంట, మురుగు కాల్వల పనులను ఎన్‌ఆర్‌ఈజీఎస్‌లో చేర్చి పనులు నిర్వహించే బాధ్యతలను సాగునీటి సంఘాలకు అప్పగించాలి. ఏటా సార్వా సీజన్‌లో కాల్వల్లోని గుర్రపు డెక్క, తూడు తొలగింపు పనుల నిర్వహణను సంఘాల పరిధిలోకి తీసుకురావాలి. నాన్ - నోటిఫైడ్ కాల్వలను ప్రభుత్వం నోటిఫై చేసి అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలి.

- హనుమార పేర్నీడు, వైస్ చైర్మన్ ముదినేపల్లి డిస్ట్రిబ్యూటరీ కమిటీ

నోటిఫై చేస్తేనే అభివృద్ధి



అన్ని పంట, మురుగుకాల్వలను పూర్తిగా నోటిఫై చేస్తేనే సాగునీటి సరఫరా, మురుగునీటి పారుదల సక్రమంగా జరుగుతుంది. నాన్ - నోటిఫైడ్ కాల్వలను గుర్తించి ప్రభుత్వం నోటిఫై చేసేందుకు చర్యలు తీసుకోవాలి.

- కేసం ప్రసాద్, అధ్యక్షుడు, బొమ్మినంపాడు నీటి సంఘం

దళారులదే రాజ్యం!

స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖలో ప్రభుత్వం ఎన్ని సంస్కరణలు తీసుకొచ్చినా దళారులదే ఇంకా పైచేయిగా నిలుస్తోంది. స్లాట్ బుకింగ్, అర్బన్ మ్యుటేషన్ సులభతరం చేయడం, కార్డు 2.0 సాఫ్ట్‌వేర్ అందుబాటులోకి తీసుకొచ్చినా ఇంకా సిబ్బంది, బయట వ్యక్తులతో లాలూచీలతో లావాదేవీలు సాగుతుండడం గమనార్హం.

» రిజిస్ట్రేషన్ల శాఖలో ఆగని దందాలు

» పొరుగున ఏసీబీ దాడులతో అప్రమత్తం

(ఏలూరు-ఆంధ్రజ్యోతి)



ఏలూరు జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంతోపాటు 11 చోట్ల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో సగటున రోజుకు 350కు పైగా భూక్రయ, విక్రయాలు సాగుతుంటాయి. గతేడాది పలుచోట్ల ఏసీబీ తనిఖీలు చేయగా, ఈ ఏడాది ఏలూరు జిల్లాను మినహాయించారు. అవినీతి ఆరోపణలు వచ్చినప్పుడల్లా ఏసీబీ అధికారులు దాడులు చేయడం రెగ్యులర్ జరుగుతుంటాయని అధికారులు కొట్టి పారేస్తున్నారు. జిల్లా కేంద్రంలో అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండడంతో ఎటువంటి లోటుపాట్లు లేకుండా సాఫీగానే రిజిస్ట్రేషన్లు సాగుతున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా ఏసీబీ అధికారులు దాడులతో జిల్లాలోని అధికారుల్లో అలజడి రేగింది.

ఇటీవల జిల్లాలో భీమడోలు, చింతలపూడి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో కింద స్థాయి సిబ్బందిపై ఆరోపణలు వెల్లువెత్తాయి. చింతలపూడిలో ఐదునెలలు క్రితం మాన్యువల్‌గా కార్యాలయంలో ఉండాల్సిన రికార్డులు బయట వ్యక్తుల చేతుల్లో - మిగతా 8వ పేజీలో

చాప కింద నీరులా..

జిల్లాలో చాప కింద నీరులాగా దళారుల చేతుల మీదుగా 50 శాతం పైబడి ఆన్‌లైన్ లావాదేవీల్లో జోక్యం పెచ్చుమీరింది. రిజిస్ట్రార్ కార్యాలయాలు కంటే అత్యాధునిక వసతులు దళారుల కార్యాలయాలకు ఉండడం గమనార్హం. వట్లూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద రిటైర్డు రెవెన్యూ సిబ్బంది దళారుల అవతారం ఎత్తుతుండడం గమనార్హం. కైకలూరు, నూజివీడు, కామవరపుకోట, గణపవరం, మండవల్లిల్లోనూ అనధికారిక ప్రైవేట్ వ్యక్తులే రాజ్యమేలుతున్నారు.





కలెక్టరేట్‌లో మాట్లాడుతున్న జేసీ అభిషేక్ గౌడ.. వందేమాతరం గేయాన్ని విద్యార్థులతో కలిపి ఆలపిస్తున్న ఎస్పీ కేపీఎస్ కిశోర్, ఏఎస్పీ సూర్యచంద్రరావు

వందేమాతరంతో దేశభక్తి భావం

150 ఏళ్ల వేడుకల్లో జేసీ అభిషేక్ గౌడ

ఏలూరు , నవంబరు 7(ఆంధ్రజ్యోతి): వందేమాతరం నినాదం.. మనందరిలో దేశభక్తిని మేల్కొల్పిన ఒక శక్తి అని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎంజే అభిషేక్ గౌడ అన్నారు. వందేమాతరం గేయం 150 ఏళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా కలెక్టరేట్‌లో అధికారులు, సిబ్బంది, ప్రజలు వందేమాతరం గేయాన్ని ఆలపించారు. జేసీ మాట్లాడుతూ బంకించంద్ర చటర్జీ రచించిన వందేమాతరం స్వాతంత్ర్య సమరయోధులకు స్ఫూర్తినిచ్చి కోట్లాది మంది భారతీయల్లో దేశభక్తిని వెలిగించిందన్నారు. కార్యక్రమంలో డీఎస్‌వో విలియమ్స్,స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ దేవకీదేవి, కలెక్టరేట్ ఏవో నాంచారయ్య, తదితరులు పాల్గొన్నారు.

వందేమాతరం స్ఫూర్తిదాయకం : ఎస్పీ

ఏలూరు క్రైం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి):దేశంలో నివసించే అన్ని కులాలు, మతాలు, భాషలు, ప్రాంతాల ప్రజల్లో స్వాతంత్ర్య కాంక్షను నెలకొల్పి ఏకతాటిపై తేవడానికి వందేమాతరం గేయం స్ఫూర్తిదాయకంగా నిలిచిందని జిల్లా ఎస్పీ కేపీఎస్ కిశోర్ అన్నారు. ఏలూరులోని జిల్లా పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో పోలీస్‌శాఖ నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన ఎస్పీ తొలుత భారతమాత చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశ స్వాతంత్ర్యం కోసం జరిగిన పోరాట స్ఫూర్తిని, త్యాగాన్ని వందేమాతరం గుర్తు చేస్తుందన్నారు. విద్యార్థులతో కలిసి వందేమాతరాన్ని ఆలపించారు. ఏఎస్పీ సూర్యచంద్రరావు, డీఎస్పీ శ్రావణ్‌కుమార్, డీటీసీ డీఎస్పీ ప్రసాద్, ఏఆర్ డీఎస్పీ చంద్రశేఖర్, ఏలూరు త్రీటౌన్ సీఐ కోటేశ్వరరావు, మహిళా పోలీస్ స్టేషన్ సీఐ ఎం సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ కార్నర్

ఐటీడీఏ ఆశ్రమ పాఠశాలల్లో ఆటల పోటీలు

బుట్టాయగూడెం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లా కెఆర్ పురం ఐటీడీఏ పరిధిలోని నూతిరామన్నపాలెం, రాజానగరం గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలబాలికల పాఠశాలల్లో జన జాతీయ గౌరవ్ దినస్ కార్యక్రమాన్ని పురస్కరించుకుని బిర్సా ముండా 150వ జయంతి సందర్భంగా శుక్రవారం ఆటల పోటీలను ఐటీడీఏ పీవో కె.రాములు నాయక్ ప్రారంభించారు. బాలురకు, బాలికలకు వేరు వేరుగా వాలీబాల్, కబాడ్డీ, అర్చరీ, వ్యాసరచన, జావెలిన్ త్రో, పెయింటింగ్, వక్తృత్వ పోటీలను నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. 100 మంది క్రీడాకారులు పాల్గొనగా వివిధ అంశాల్లో 51 మందిని ఎంపిక చేశారు. పోటీల్లో గెలిపొందిన విద్యార్థులకు రెండు రోజులుపాటు శిక్షణ ఇచ్చి


పిల్లలతో కబడ్డీ ఆడుతున్న ఐటీడీఏ పీవో రాములు

విశాఖపట్నంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు పంపుతామన్నారు. ఎటిడబ్ల్యూవో జనార్ధనావు, ఎఎంవో కె.శిరమయ్య, డీవైఈవో కుమార్ హెచ్ఎంలు, ఉపాధ్యాయులు క్రీడాకారులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి వృత్తివిద్య పోటీలకు జిల్లా విద్యార్థి బృందాల ఎంపిక

ఏలూరు అర్బన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు వివిధ వృత్తుల్లో నైపుణ్యాలపై జిల్లా విద్యాశాఖ, సమగ్రశిక్షా అభియాన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఏలూరు డీసీఎంఎస్ ఫంక్షన్ హాలులో జిల్లాస్థాయి పోటీలు నిర్వహించి, రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. జిల్లావ్యాప్తంగా 38 ఒకేషనల్ స్కూళ్ల నుంచి విద్యార్థులు హాజరు కాగా, మొత్తం 10 రకాల వృత్తుల్లో ఆధునిక నైపుణ్యాలు, ఆవిష్కరణలు, అంకుర సంస్థల్లో నూతన పోకడలపై బాల,బాలికల ప్రతిభను పరీక్షించేందుకు ప్రదర్శనలు ఏర్పాటయ్యాయి. వీటినుంచి న్యాయనిర్ణేతలు ఉత్తమమైనవాటిని ఎంపికచేసి, విజేతలకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. డీఈవో వెంకట లక్ష్మమ్మ మాట్లాడుతూ చదువుతో పాటే వృత్తి విద్యాకోర్సుల్లో నైపుణ్యాలను సాధించడం ద్వారా స్వయం ఉపాధిని పొందడంతో పాటు, మరి కొందరికి ఉపాధి అవకాశాలు కల్పించవచ్చునన్నారు. సమగ్రశిక్షా జిల్లా ఏపీసీ పంకజ్ కుమార్ మాట్లాడుతూ ఉద్యోగాలతో పాటే వృత్తుల్లోకూడా నిబద్ధత, నైపుణ్యం పాటిస్తే పోటీ ప్రపంచంలోనూ ధీటుగా రాణించగలరని విద్యార్థులకు సూచించారు. జిల్లాలోని అన్ని హైస్కూళ్లలో బాలబాలికలకు వృత్తుల్లో తర్ఫీదు నిచ్చేందుకు పార్ట్‌టైం ఇన్‌స్ట్రక్టర్లను నియమించామన్నారు. ఎస్ఎస్ఏ జీసీడీవో నవీనకుమారి మాట్లాడుతూ జిల్లా విజేతలతో ఈ నెలాఖరులోగా విజయవాడలో రాష్ట్రస్థాయి పోటీలు జరుగుతాయన్నారు. డీఆర్డీయే ప్రాజెక్టు డైరెక్టర్ విజయరాజు, సెట్‌వెల్ సీఈవో ప్రభాకర్, ఎంఈవో అరుణ్‌కుమార్, జిల్లా సైన్స్ ఆఫీసర్


జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న ఎస్ఎస్ఏ జిల్లా ఏపీసీ పంకజ్‌కుమార్, డీఈవో, తదితరులు

సోమయాజులు, సెక్టోరల్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

జిల్లా విజేతలు వీరే

రిటైల్‌రంగం వృత్తి పోటీలో యర్రగుంటపల్లి జడ్పీ హైస్కూలు విద్యార్థుల బృందం, బీఎఫ్ఎస్ఐ (బ్యాంకింగ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ అండ్ ఇన్సూరెన్స్) పోటీలో పెదపాడు జడ్పీ హైస్కూలు విద్యార్థి బృందం, ఫుడ్ ప్రాసెసింగ్ పోటీలో బొర్రంపాలెం జడ్పీహెచ్ఎస్ విద్యార్థి బృందం, బ్యూటీ అండ్ వెల్‌నెస్ పోటీలో నూజివీడు జడ్పీ బాలికోన్నత పాఠశాల విద్యార్థినుల బృందం, హెల్త్‌కేర్ పోటీలో అడవికొలను జడ్పీహెచ్ఎస్ విద్యార్థి బృందం, అప్పారెల్ (రెడీమేడ్ దుస్తుల తయారీ) పోటీలో పెదనిండ్రకొలను జడ్పీహెచ్ఎస్ విద్యార్థిబృందం, ఐటీ/ఐటీఈఎస్ పోటీలో నూజివీడు జడ్పీ బాలికోన్నత పాఠశాల విద్యార్థినుల బృందం, ఆటోమోటివ్ పోటీలో బొమ్మిడి జడ్పీహెచ్ఎస్ విద్యార్థిబృందం, అగ్రికల్చర్ పోటీలో కొవ్వలి జడ్పీహెచ్ఎస్ విద్యార్థిబృందం, ఎలక్ట్రానిక్స్ పోటీలో మండవల్లి జడ్పీహెచ్ఎస్ విద్యార్థి బృందం రాష్ట్రస్థాయి పోటీలకు ఏలూరు జిల్లా నుంచి ఎంపికయ్యాయి.

స్విమ్మింగ్‌లో ఏలూరు క్రీడాకారుల ప్రతిభ

ఏలూరు రూరల్, నవంబరు 7, (ఆంధ్రజ్యోతి) : ఇటీవల గుంటూరు జిల్లా నరసరావుపేటలో జరిగిన ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీల్లో ఏలూరు విశ్వనాథ్ భర్తియా స్విమ్మింగ్ పూల్ క్రీడాకారులు సత్తా చాటారు. బంగారు, వెండి పతకాలతో అదరగొట్టారు. అండర్-17 విభాగంలో మోక్ష ప్రియ బ్యాక్ స్ట్రోక్, 50, 100 మీటర్ల విభాగంలో రెండు వెండి పతకాలు, ఐఎం 200 మీటర్ల రజితం, ధనుష్ సాయి బటర్‌ఫ్లై 100, 50 మీటర్లు విభాగంలో రెండు బంగారు పథకాలు ఫ్రీస్టైల్ విభాగంలో వెండి పతకం సాధించారు. అలాగే పూర్వి బటర్‌ఫ్లై విభాగంలో బంగారు పతకం, అయ్యం


కీడాకారులను అభినందిస్తున్న డీఎస్‌డీవో అజీజ్

200 మీటర్లు బంగారు పతకం, ఫ్రీస్టైల్ విభాగంలో రజిత పతకం సాధించింది. క్రీడాకారులను, స్విమ్మింగ్ కోచ్‌లను జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎస్ఏ అజీజ్ అభినందించారు.

రాష్ట్ర స్థాయి రన్నింగ్ పోటీలకు మోగల్లు విద్యార్థి

పాలకోడేరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయి స్కూల్ గేమ్ పోటీల్లో నిర్వహించిన రన్నింగ్ రేస్‌లో మొదటి స్థానం గెలుచుకుని తమ విద్యార్థి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు మోగల్లు అల్లూరి సీతారామరాజు జిల్లా పరిషత్ హైస్కూల్ పాఠశాల హెచ్ఎం త్రినాథులు తెలిపారు. పదవ తరగతి చదువుతున్న ఎస్.ధరణి పెదవేగిలో శుక్రవారం జరిగిన పోటీల్లో మూడు కిలోమీటర్ల రన్నింగ్ రేసులో ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. స్కూల్ పీడీ



సూర్య, కోచ్ వెంకటేష్‌ను సర్పంచ్ మల్లిపూడి కృష్ణకుమారి, విద్యాకమిటీ చైర్మన్ సుబ్రహ్మణ్యం, గ్రామ పెద్దలు అభినందించారు.

నెట్‌బాల్ పోటీలకు సీఎస్ఎన్ కళాశాల విద్యార్థులు

భీమవరం రూరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : భీమవరం డాక్టర్ సీఎస్ఎన్ జూనియర్ కళాశాల నుండి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఎన్‌టీఆర్ జిల్లా విజయవాడలోని పటమట హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో 8వ తేదీ నుండి జరగనున్న 69వ రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ అండర్-17 నెట్ బాల్ బాలబాలికల పోటీలకు తమ కళాశాల విద్యార్థులు ఎంపికయ్యారని డాక్టర్ సీఎస్ఎన్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎండి సలీం ఖాన్ తెలిపారు. బాలుర విభాగంలో ఎన్. విలియం, జి.త్రినాథ్, స్టాండ్ బై డి.దేవ్ ఎంపికవగా బాలికల విభాగంలో ఎం.ఎస్తేరు, పి.స్వాతిలు స్టాండ్ బై జీవన లక్ష్మీ తులసిలు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ ఎండి. సలీంఖాన్ తెలిపారు. ఇటీవల ఉమ్మడి పశ్చిమ


విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల సెక్రటరీ సత్యనారాయణ, ప్రిన్సిపాల్ సలీంఖాన్

గోదావరి జిల్లా అండర్-17 బాలబాలికల నెట్ బాల్ సెలక్షన్స్‌లో ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని కోచ్ దావూద్ ఖాన్ తెలిపారు. కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ డాక్టర్ చీడే సత్యనారాయణ, ట్రెజరర్ వడుపు గోపి, అధ్యాపకులు,సిబ్బంది అభినందించారు.

అథ్లెటిక్స్ స్టేట్‌మీట్ పరుగు పోటీకి దొరబాబు

ఏలూరు అర్బన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : వినుకొండ (పల్నాడు జిల్లా)లో ఈ నెల 22, 23 తేదీల్లో జరుగునున్న స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ మీట్ 200 మీటర్లు, 400 మీటర్ల రన్నింగ్ పోటీకి ఏలూరు సుబ్బమ్మదేవి మున్సిపల్ హైస్కూలు పదో తరగతి విద్యార్థి ఎం.దొరబాబు జిల్లా నుంచి ఎంపికయ్యాడు. జిల్లాస్థాయి ఎంపికల పోటీ ఈ నెల 5న పెదవేగిలో జరిగిందని స్కూలు హెచ్ఎం పి.కుటుంబరావు, సెకండ్ అసిస్టెంట్ హెచ్ఎం కె.వి.షడ్రక్ తెలిపారు. దొరబాబుని


స్కూలు హెచ్‌ఎంతో దొరబాబు

స్కూలు వ్యాయామోపాధ్యాయులు ఎస్.లీలా కుమారి, జె.సుబిత్ అభినందించారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో అనాకోడేరు విద్యార్థి ప్రతిభ

భీమవరం రూరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : అనాకోడేరులోని డీఎన్నార్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి అండర్-17 రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీల్లో ప్రతిభ కనబరిచినట్టు స్కూల్ ప్రధానోపాధ్యాయుడు సూర్య భగవాన్‌రాజు తెలిపారు. శుక్రవారం పాఠశాలలో అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న ఎన్.నెహెమ్యా కొవ్వూరులో జరిగిన అండర్-17 రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీల్లో ఆడి తృతీయ స్థానంలో నిలిచాడన్నారు. ఉపాధ్యాయులు అభినందించారు.


విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

మారంపల్లికి వెళ్లేదెలా ?


రైల్వే లైన్ విస్తరణలో పోయే దారి ఇదే..

దశాబ్దాలుగా రైల్వే రోడ్డే దిక్కు
రైల్వే లైన్ విస్తరణతో రహదారి మాయం
ఆందోళనలో గ్రామస్థులు
కొత్తమార్గం వేస్తామని ఎమ్మెల్యే బొలిశెట్టి హామీ

తాడేపల్లిగూడెం రూరల్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): పశ్చిమగోదావరి జిల్లా అంటే ఎంతో సంపన్న జిల్లాగా పేరు. అభివృద్ధి చెందిన జిల్లాగా ఖ్యాతి గడించింది. గ్రామాలకు మౌలిక వసతుల కల్పనలోనూ ముందే ఉంటుంది. అయితే ఇప్పటికీ రహదారి లేని గ్రామం ఉందంటే పైకి కిందికీ చూస్తాం. కానీ తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో ఇటువంటి గ్రామం ఉందంటే ఆశ్చర్యపోక తప్పదు. ఇప్పటి వరకూ రైల్వే అప్రోచ్ పుంతనే తమ మార్గంగా గ్రామస్థులు కాలం నెట్టుకొచ్చారు. కానీ ప్రస్తుతం ఆ రైల్వేలైన్ విస్తరణ పనుల్లో ఆ రోడ్డు మాయం కానుండటంతో ఆ గ్రామస్థులకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోనున్నాయి. తాడేపల్లి గూడెం మండలం మారంపల్లి గ్రామానికి వెళ్లాలంటే తొలినాళ్లలో పంట పుంతల మధ్య నడుచుకుంటూ వెళ్లేవారు. అంతటా రోడ్లు పడినా ఈ గ్రామానికి సొంత దారి లేక ఇబ్బంది పడుతూనే ఉన్నారు. ఈ గ్రామాన్ని ఆర్టీసీ బస్సు కన్నెత్తి చూసింది లేదు. తాడేపల్లిగూడెం పట్టణానికి 12 కిలోమీటర్లు, తూర్పుగోదావరి జిల్లా నిడదవోలుకు 8 కిలో మీటర్ల దూరంలోనే ఈ గ్రామం ఉంటుంది. ఇప్పుడు ఈ గ్రామానికి సొంత రోడ్డు వేసేందుకు తాను బాధ్యత తీసుకుంటానని చెప్పిన ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ పైనే ఆ గ్రామస్థులు కొండంత ఆశలు పెట్టుకున్నారు.


నూతన మార్గం కోసం ప్రతిపాదిత ప్రాంతం

గ్రామం పరిస్థితి ఇదీ..

తాడేపల్లిగూడెం మండలంలో ఉండే సంపన్న గ్రామాల్లో ఒకటైన ఈ గ్రామం మూడు వందలఏళ్ల క్రితమే ఏర్పడింది. ఈ గ్రామం జగన్నాథపురం శివారు గ్రామంగా ఉండేది. అయితే 60 ఏళ్ల క్రితం ఈ గ్రామానికి పంచాయితీ హోదా కల్పించారు. ఈ గ్రామానికి ఆనుకుని ఎర్రకాలువ ఉండటంతో వర్షాకాలం వచ్చిందంటే వరదలకు గ్రామం చుట్టూ వరదనీరు చేరి ఒక దీవిలా మారుతుంది. ఈ గ్రామానికి మార్గం దశాబ్దాల కాలంగా ప్రజలకు తీరని కోరికగా మారింది. తాజాగా గ్రామానికి ఉపయోగించే దారిని రైల్వేలైన్ విస్తరణ జరుగుతుందని అధికారులు కొలతలు కొలుస్తుండటంతో తమకు బయటకు వెళ్లే మార్గమే లేకుండా పోతుందని ఆందోళనలో మునిగిపోయారు.

ఎమ్మెల్యే బొలిశెట్టి భరోసా..

ఈ గ్రామానికి మెరుగైన రోడ్డుమార్గం ఏర్పాటు చేసే బాధ్యత తీసుకుంటానని తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ గ్రామంలో నిర్వహించిన జనసేన గ్రామ సభలో హామీ ఇచ్చారు. దాతలు కూడా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. రోడ్డు నిర్మాణానికి దాతల సహకారం కోరుతూ గ్రామంలో కమిటీ కూడా వేశారు. రోడ్డు నిర్మాణం ఎప్పుడు జరుగుతుందో .. తమ కోరిక ఎప్పుడు తీరుతుందో అని గ్రామస్థులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

ఊహ తెలిసినప్పటి నుంచి ఇదే దారి



మా గ్రామానికి ఊహ తెలిసి నాటి నుంచి దారిలేదు. రైల్వే మార్గంలోనే పయనిస్తున్నాం.ఎంత మంది పాలకులు మారినా మా సమస్య తీరడం లేదు. కూటమి ప్రభుత్వంలో ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్లాం. పరిష్కారం అవుతుందని బలంగా నమ్ముతున్నాం.

- తోట సూర్యనారాయణ, జనసేన కన్వీనర్ మారంపల్లి

పార్టీలకతీతంగా సహకారం



మా గ్రామానికి పూర్వీకుల నాటి నుంచి ఇదే పరిస్థితి. ప్రజలకు ఈ రోడ్డు తీరని సమస్య. ప్రస్తుత పరిస్థితుల్లో ఈ రోడ్డు నిర్మాణ బాధ్యత ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ తీసుకున్నారు. దీనికి పార్టీలకతీతంగా అందరి సహకారం ఉంటుంది.

- సరిపల్లె చిట్టిబాబు, ఉపసర్పంచ్ మారంపల్లి

నడుచుకుంటూ వెళ్లాల్సిందే



మా గ్రామంలో ఎవరికి ఏ సమస్య వచ్చినా తాడేపల్లిగూడెం కానీ నిడదవోలు కాని వెళ్లాల్సిన పరిస్థితి. పిల్లలు చదువుకునేందుకు వెళ్లాలంటే రెండున్నర కిలోమీటర్లు నడిచి వెళ్లాల్సిందే, ఇంట్లో మోటారుసైకిల్ లేకపోతే గ్రామంలో వారి పరిస్థితి మరీ దయనీయం. నేను కూడా చిన్నప్పుడు ఎంతో నరకం అనుభవించాను.

-ఎం.దుర్గాప్రసాద్, గ్రామస్థుడు

తణుకు రైల్వేస్టేషన్ రోడ్డుకు మోక్షం

మున్సిపల్ నిధులు రూ.కోటీ 40 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం
ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ చొరవ

తణుకు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): తణుకు రైల్వేస్టేషన్ రోడ్డులో ప్రయాణం నరకమే. అడుగడుగునా గోతులు. రైల్వేస్టేషన్‌కు వెళ్లే రహదారి అధ్వాన్నంగా ఉంది. గతంలో ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ గోతులు పూడ్పించారు. వర్షాలకు గోతుల మయంగా తయారైంది. దీంతో రైల్వే స్టేషన్‌కు వెళ్ళే ప్రయాణికులతో పాటు బ్యాంకు కాలనీకు వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం రోడ్డులో అనేక వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. రైల్వే స్టేషన్‌కు రద్దీ పెరిగింది. రోజూ 24 రైళ్లు తణుకు స్టేషన్ మీదుగా రైళ్ల రాకపోకలు సాగిస్తుంటాయి. స్టేషన్‌కు వచ్చి వెళ్తున్నవారు చాలా ఏళ్లుగా ఇబ్బందులు పడుతున్నారు. గోతులమయంగా ఉన్న స్టేషన్ రోడ్డుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ చొరవతో మున్సిపల్ నిధులు కోటీ 40 లక్షలు మంజూరు చేశారు. మున్సిపల్ నిధులుతో సీసీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయించారు. 10 తేదీ సోమవారం సీసీ రోడ్డు పనులు ప్రారంభించనున్నట్లు మున్సిపల్ డీఈఈ కొవ్వూరి ఈశ్వర్‌రెడ్డి తెలిపారు.


గోతులమయంగా ఉన్న రైల్వేస్టేషన్‌కు వెళ్లే రోడ్డు (ఫైల్)

సంప్రదాయ కళకు ప్రాణం



ఆధ్యాత్మిక సేవలో గణపవరం కోలాట బృందాలు
35 గ్రూపులకు శిక్షణ
సంస్కృతీ సంప్రదాయాల పరిరక్షణకు కృషి

గణపవరం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): కోలాటం ప్రాచీనకళ.. రెండు కర్రలు చేత పట్టుకుని పదం పాడుతూ గుండ్రంగా తిరుగుతూ చేసే కోలాట నృత్యాలు ప్రతీపల్లెల్లో దర్శనమిచ్చేవి. రాను రాను ఆ కళ కనుమరుగవుతోంది. ముఖ్యంగా భావితరాలకు కోలాటం అంటే తెలియని పరిస్థితి వచ్చేసింది. హిందూ ధార్మికతను బతికించాలని కొందరు వ్యక్తులు చేసే కృషితో మళ్లీ ఆ కళ జీవం పోసుకుంటున్నది. గృహిణులు ఇళ్లకే పరిమితం కాకుండా కోలాటం, నృత్యం వైపు మళ్లుతున్నారు. దీని ద్వారా మానసికంగా, శారీరకంగా కొంత విశ్రాంతి పొందుతున్నట్లు తెలిపారు. కోలాటం అంటే చేతిలో చిడతలు, కాళ్లకు గజ్జలు కట్టుకుని నోటితో పాటలు పాడటం ద్వారా శారీరంలోని నవనాడులకు పని కల్పించినట్లు అవుతుందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

బాలికలతో పాటు గృహిణులు

గణపవరం మండలంలో దాదాపు 35 గ్రూపులతో బాల, బాలికలతో పాటు గృహిణులు శిక్షణ పొందుతున్నారు. తిరుమల తిరుపతి దాస సాహిత్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో గణపవరానికి చెందిన కోలాట నృత్య శిక్షకుడు కొప్పినేటి సూర్య వీరికి తర్ఫీదునిచ్చారు. కోలాటంలో హారతి, జడా, శ్రీకృష్ణుడు, పాము మెలికలు, బిందెలతో నృత్యం వంటి 25 రకాల నృత్యాలు ఇక్కడ బృంద సభ్యులు నేర్చుకున్నారు. వేసవి సెలవులతో పాటు మిగతా రోజుల్లో వారానికి రెండురోజుల పాటు శిక్షణ పొందారు. అలాగే ఈ బృందాలు గజ్జికట్టి ప్రదర్శనలు ఇస్తున్నారు. వినాయకచవితి, విజయదశమి, ప్రస్తుతం కార్తీకమాసంలో కోలాట బృందాలు ప్రదర్శనలు ఇస్తున్నారు. అలాగే ఈ బృందాలు తిరుమల బ్రహ్మోత్సవాల్లో కూడా పాల్గొన్నారు.

మానసిక, శారీరక ఉల్లాసం



ప్రతీరోజు కోలాట సాధన చేస్తే మానసిక, శారీరక ఉల్లాసానికి ఎంతో ఉపయోగం. రోజంతా ఎంతో ఉత్సాహంగా ఉంటుంది. బృందసభ్యులతో కలిసి కోలాటం ప్రదర్శించడం వలన ఒత్తిడి దూరమవుతుంది. గత పదేళ్లగా కోలాట ప్రదర్శనలు ఇస్తున్నాను. కోలాటం ద్వారా మన సంస్కృతి, సంప్రదాయ పరిరక్షణకు దోహదపడే అవకాశం ఉంది.

బోను జ్యోతిస్వరూప, గణపవరం


శిక్షణ పొందిన చిన్నారులు

కళకు ప్రాచీన వైభవం తీసుకురావాలి



ప్రాచీన సంప్రదాయ కళ అయిన కోలాటానికి పూర్వవైభవం రావాలి. దీనికి ప్రతీ ఒక్కరు కృషి చేయాలి. కోలాట ప్రదర్శనలతో మానసిక, శారీరక ఉత్సాహం లభిస్తుంది. కోలాటం నేర్చుకోవడం అదృష్టంగా భావిస్తున్నా. టీవీలకు, ఫోన్లకు అలవాటు పడిపోకుండా ఆధ్యాత్మికత వైపు దృష్టి మళ్లించేందుకు ఈ కోలాట నృత్య ప్రదర్శన ఒక సాధనగా ఉపయోగపడింది.

బొబ్బిలి ఏసురాణి, బావాయిపాలెం

తిరుమల ప్రదర్శనలో పాల్గొన్నా



తిరుమల తిరుపతి స్వామివారి బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్నాను. స్థానిక కనకదుర్గమ్మ ఆలయంలో ప్రతీ శుక్రవారం 20 మంది కోలాట బృందంతో నృత్యం చేస్తాం. కోలాటం వల్ల శారీరంలోని అన్ని నరాలు పని చేస్తాయి. రక్తప్రసరణ సక్రమంగా జరుగుతుంది. బీపీ, సుగర్ దరిచేరవు.

- గాజుల హైమావతి, చినరామచంద్రాపురం

హిందూ ధర్మాన్ని పరిరక్షించుకోవాలి



హిందూ ధర్మాన్ని పరిరక్షించాలన్నదే నా ముఖ్య లక్ష్యం. తిరుమల తిరుపతి ఆధ్వర్యంలో దాస సాహిత్య ప్రాజెక్టు ద్వారా ఉచితంగా ఈ కోలాట నృత్య బృందాలను తయారు చేస్తున్నా. ఇప్పటి వరకు గణపవరం మండలంలోనే 30 బృందాలు తయారయ్యాయి. వీరికి కోలాట నృత్యాలతో పాటు సంకీర్తనలు కూడా నేర్పిస్తూ సంస్కృతి పరిరక్షణకు శ్రమిస్తున్నాం.

- కొప్పినేటి సూర్య, కోలాట నృత్య శిక్షకుడు, గణపవరం


శ్రీవారి ఆలయానికి ఇరుముళ్లు సమర్పించేందుకు వచ్చిన వృద్ధురాలు

ఎనిమిది పదుల వయసులో దీక్ష

ద్వారకాతిరుమల, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): వయసు కేవలం అంకెలకే పరిమితం అని నిరూపిస్తున్నారు ఈ బామ్మ.. ఎనిమిది పదుల వయసులోనూ కఠోర దీక్షలు చేపట్టి తన భక్తిప్రపత్తులను చాటుతున్నారు. ఒంగోలు కు చెందిన నీలంరాజు సీతమ్మ కొన్నాళ్లక్రితం వేంకటేశ్వరస్వామి దీక్షను స్వీకరించి తన కుటుంబసభ్యులతో కలసి ద్వారకాతిరుమలకు వచ్చి శుక్రవారం ఇరుముడులు సమర్పించారు.


మాట్లాడుతున్న ఉమ్మడి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్

కనీస వయసు లేకుండా చేసే వివాహంతో అనర్థాలు

పెదవేగి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): కనీస వయసు లేకుండా వివాహం చేస్తే వారి ఆరోగ్యంపై పెనుప్రభావం చూపి, అనర్థాలకు కారణమవుతుందని ఉమ్మడి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ అన్నారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా న్యాయ సేవాధికారసంస్థ ఆధ్వర్యంలో పెదవేగి మండలం విజయరాయిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాల్య వివాహాలతో కలిగే అనర్థాలు, బాలల హక్కులపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. రత్నప్రసాద్ మాట్లాడుతూ బాల్య వివాహ వ్యవస్థ ఒక దురాచారమని ఇలాంటి సంఘటనలు ఎదురైతే 1098 నంబర్, జిల్లా న్యాయ సేవాధికారసంస్థ టోల్‌ఫ్రీ నంబర్ 15100కు సమాచారం అందించాలని సూచించారు. ట్రైనీ మాస్టర్ పి.రత్నరాజు, చైల్డ్ రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్ జిల్లా కోఆర్డినేటర్ రవి, హెచ్ఎం ఎం.వెంకటరమణ, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

శబరిమలైకు ప్రత్యేక రైళ్లు

ఏలూరు క్రైం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : అయ్యప్పస్వాముల సౌకర్యార్థం శబరిమలై వెళ్లే భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని దక్షిణ మధ్య రైల్వే శాఖ 60 ప్రత్యేక రైళ్ళను ఏర్పాటు చేసినట్లు రైల్వే అధికారులు తెలిపారు. ఈ రైళ్ళు జనవరి 21వ తేదీ వరకు నడుపుతున్నట్లు ప్రకటించారు.

07101 మచిలీపట్టణం - కొల్లాం (గూడురు, రేణిగుంట) ప్రతి శుక్రవారం
07102 కొల్లాం - మచిలీపట్టణం (రేణిగుంట, గూడూరు) ప్రతి ఆదివారం
07103 మచిలీపట్టణం-కొల్లాం (గుంటూరు, కడప, రేణిగుంట) శుక్రవారం
07104 కొల్లాం-మచిలీపట్టణం (రేణిగుంట, కడప, నంద్యాల, గుంటూరు) ఆదివారం
07105 నర్సాపురం-కొల్లాం (విజయవాడ, గూడూరు,రేణిగుంట)ప్రతి ఆదివారం
07106 కొల్లాం-నర్సాపురం (రేణిగుంట,గూడూరు,విజయవాడ) మంగళవారం
07107 చర్లపల్లి -కొల్లాం (గుంటూరు, గూడూరు, రేణిగుంట) సోమవారం
07108కొల్లాం-చర్లపల్లి (రేణిగుంట, గూడూరు, గుంటూరు,పగిడిపల్లి) బుధవారం

రెండు రైళ్లు రద్దు

ఏలూరు క్రైం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) :తిరుపతి నుంచి అనకాపల్లి ఆదివారం నడుస్తున్న ప్రత్యేక రైలు 07481ని ఈనెల 9,16,23, 30 తేదీలలో రద్దు చేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు తెలిపారు. అనకాపల్లి నుంచి తిరుపతి ప్రతి సోమవారం నడుపుతున్న రైల్ నెంబర్ 07482 ఈనెల 10, 17, 24 డిసెంబర్ 1వ తేదీన రద్దు చేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు శుక్ర వారం రాత్రి ఒక ప్రకటన విడుదల చేశారు.



నార్వే అధికారులతో ఎంపీ మహేశ్

రాష్ట్రానికి రండి..ఆక్వా పరిశ్రమ పరిశీలించండి

నార్వే ప్రతినిధులకు ఎంపీ మహేశ్ ఆహ్వానం

ఏలూరు టూటౌన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి వచ్చి ఇక్కడ ఆక్వా పరిశ్రమతో కలిసి పని చేయాలని నార్వే సీఫుడ్ కౌన్సిల్ సభ్యులకు ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ ఆహ్వానించారు. నార్వే పర్యటనలో ఉన్న ఆయన శుక్రవారం నార్వే సీఫుడ్ కౌన్సిల్ ప్రధాన కార్యలయాన్ని సందర్శించారు. నార్వేలో ఆక్వా రంగాభివృద్ధి, సముద్ర ఆధారిత ఉత్పత్తుల వ్యాపారం లాభదాయకంగా ఎలా నడిపిస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. భారతదేశంలో ఆంధ్రప్రదేశ్‌లో ఆక్వా రంగాభివృద్ధికి ఎంతో అవకాశం ఉందని మా రాష్ట్రానికి వచ్చి ఆక్వా రంగాన్ని పరిశీలించాలని అక్కడ అధికారులకు తెలియజేశారు. దేశంలో అత్యధిక తీరప్రాంతం ఉన్న ప్రదేశం ఆంధ్రప్రదేశ్ అని, ఇక్కడ ఆక్వా రంగాభివృద్ధికి ఎన్నో అవకాశాలున్నాయని వివరించారు.

సీసీటీవీ, స్మోక్ డిటెక్టివ్ మీద ఉచిత శిక్షణ

పెదపాడు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) :యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారి యూనియన్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ నందు గ్రామీణ ప్రాంత స్త్రీపురుషులకు ఉచితంగా సీసీటీవీ, సెక్యూరిటీ అలారం, స్మోక్ డిటెక్టివ్ (13 రోజులు) సెల్‌ఫోన్ రిపేర్స్ (30 రోజులు) మీద ఉచిత శిక్షణను అంద జేస్తున్నట్లుగా సంస్థ ఒక ప్రకటనలో తెలిపింది. ఉచిత శిక్షణలో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలకు చెందిన అభ్యర్థులు దరఖాస్తు చేసు కోవచ్చునన్నారు. శిక్షణా కాలంలో ఉచితంగా భోజనం, వసతి కల్పిస్తామన్నారు. ఆసక్తిగలవారు 99485 65256, 90140 40780 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

చిత్రలేఖనంలో జడ్పీ విద్యార్థుల ప్రతిభ

ఏలూరు రూరల్, నవంబరు 7, (ఆంధ్రజ్యోతి) : రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన చిత్రలేఖనం పోటీల్లో శనివారపుపేట జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపారు. ఇటీవల రోటరీ క్లబ్ పీస్ నినాదంపై పోటీలు నిర్వహించింది. పాఠశాల నుంచి నలుగురు విద్యార్థులు పాల్గొనగా 8వ తరగతి విద్యార్థిని సీహెచ్ వైష్ణవి ప్రథమ స్థానం సాధించింది. విద్యార్థులకు మెరిట్ అవార్డు సర్టిఫికెట్లు లభించాయి. డ్రాయింగ్ టీచర్ రజనీకాంత్, విజేతలుగా నిలిచిన విద్యార్థులను క్లబ్బు సభ్యులు బహుమతులు అందించి అభినందించారు. పాఠశాల హెచ్‌ఎం ప్రకాశరావు,ఉపాధ్యాయులు, విద్యార్థులను అభినందించారు.

దోపిడీ దొంగలు దొరికారు

రూ. 7 లక్షల విలువైన సొత్తు స్వాధీనం


బైక్ పోగొట్టుకున్న బాధితునికి తాళాలు అందజేస్తున్న ఎస్పీ

ఏలూరు క్రైం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : దారిదోపిడీ, బైక్ చోరీలకు పాల్పడుతున్న నలుగురు బాల నేరస్తులతో పాటు ఒక యువకుడిని శుక్ర వారం ఉదయం అరెస్టు చేసి వారి నుంచి మొత్తం 7 లక్షల పది వేల రూపాయల విలువ గల వస్తువులు స్వాధీనం చేసు కున్నట్టు ఏలూరు ఎస్పీ కేపీఎస్ కిషోర్ చెప్పారు. ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం మధ్యాహ్నం విలేకరుల సమావేశంలో ఎస్పీ వివరాలను వెల్లడించారు. లింగ పాలెం మండలం కళ్ళచెరువు గ్రామంలో ఉన్న ఒక వైన్‌షాపులో గుమస్తాగా గుడివాక అంజనేయ ప్రసాద్ పని చేస్తున్నారు. ఈఏడాది అక్టోబర్ 28వ తేదీ రాత్రి షాపు కట్టివేసిన అనంతరం 40 వేల రూపాయల నగదు తీసుకుని మోటారు సైకిల్‌పై ఏలూరు వస్తున్నారు. ఏలూరు - జంగారెడ్డిగూడెం రోడ్డు మార్గమధ్యలో దెందులూరు మండలం గంగన్నగూడెం వద్ద సాయి పబ్లిక్ స్కూలు ఎదురుగా అకస్మాత్తుగా రెండు మోటారు సైకిళ్ళపై ఐదుగురు యువకులు ఆయనను అడ్డగించి కర్రలతో తలపై కొట్టి రూ.40 వేల నగదు తీసుకుని పరారయ్యారు. ఈ సంఘటనపై దెందులూరు పోలీసులు కేసు నమోదు చేయగా జిల్లా ఎస్పీ కిషోర్ ఆదేశాల మేరకు నూజివీడు డీఎస్పీ ప్రసాద్ ఆధ్వర్యంలో పెదవేగి సీఐ రాజశేఖర్ టెక్నాలజీ ద్వారా సిబ్బందితో నిఘా ఏర్పాటు చేశారు. శుక్రవారం ఉదయం 10 గంటల సమయంలో ఏలూరు -జంగారెడ్డిగూడెం రోడ్డులోని సోమవరప్పాడు బ్రిడ్జికింద ఐదుగురు యువకులు అనుమానాస్పదంగా ఉండడంతో వారిని అదుపులోకి తీసు కున్నారు. నలుగురు బాల నేరస్తులతో పాటు ఏలూరు రూరల్ మండలం వెంకటాపురం పంచాయతీ చెంచుల కాలనీకి చెందిన బంగారు సుబ్ర హ్మణ్యంను (21) అరెస్టు చేశారు. వీరు మోటారు సైకిల్ దొంగతనాలకు పాల్పడి ఆ మోటారు సైకిళ్లను ఉపయోగించి ఇళ్ళ దొంగతనాలు, దారి దోపిడీలకు పాల్పడుతున్నారని ఎస్పీ వెల్లడించారు. వీరి నుంచి 9 మోటారు సైకిళ్ళు, 10 వేల రూపాయల నగదు, మొత్తం విలువ 7 లక్షల పది వేల రూపాయల విలువైన సొత్తు స్వాధీనం చేసుకున్నట్టు ఎస్పీ వివరించారు. చాకచక్యంగా వ్యవహరించిన క్రైంపార్టీ సిబ్బందికి పెదవేగి సీఐ ల్యాప్ టాప్‌ను బహుమతిగా సమకూర్చగా దానిని ఎస్పీ అందజేసి అభినందిం చారు. పోలీసు అధికారులందరికీ ప్రశంసాపత్రాలను అందించారు. అదనపు ఎస్పీ సూర్యచంద్రరావు, నూజివీడు డీఎస్పీ ప్రసాద్, పెదవేగి ఎస్ఐ రామకృష్ణ పాల్గొన్నారు.

పెద్ద నోట్ల రద్దుకు.. పదేళ్లు



- ఆశించిన స్థాయిలో జరగని నల్లధనం నిర్మూలన
- బ్యాంకులకు ముద్రణ భారం ▸ పడిపోయిన జీడీపీ
- ఊరటనిచ్చిన నగదు రహిత లావాదేవీల పెరుగుదల

మన దేశంలో పెద్ద నోట్లు రద్దయి పదేళ్లు అయింది. 2016 నవంబరు 8వ తేదీ సాయంత్రం 5.30 గంటలకు కేంద్ర ప్రభుత్వం ప్రకటనతో దేశ వ్యాప్తంగా నగదు లావాదేవీలపై తీవ్ర ప్రభావం ఏర్పడింది. దేశంలో చెలామణిలో వున్న రూ. 500, రూ. 1000 నోట్లను రద్దు చేయడం ద్వారా దేశంలో నల్లధనం నిల్వలను తగ్గించడం, నకిలీ కరెన్సీ నిర్మూలన, నగదు రహిత ఆర్థిక లావాదేవీలను ప్రోత్సహించడం వంటి లక్ష్యాల కోసం పెద్ద నోట్లను ప్రభుత్వం రద్దు చేసింది.


బ్యాంక్ ముందు బారులు తీరిన ఖాతాదారులు (ఫైల్)

(తణుకు రూరల్-ఆంధ్రజ్యోతి)

పెద్ద నోట్ల రద్దు ప్రభావం దేశ ఆర్థిక వ్యవస్థతో పాటు సామాజిక, పారిశ్రామిక రంగాలపై ఎంతో ప్రభావం చూపింది. దేశంలో ఆర్థిక వ్యవస్థను ఆధునీకరించేందుకు చేపట్టిన ఈ ప్రక్రియలో సుమారు 6 నెలల పాటు నగదు ప్రవాహం తగ్గిపోయి సామాన్యుల నుంచి ఉద్యోగులు, పారిశ్రామికవేత్తల వరకూ అనేక ఇబ్బందులెదుర్కొన్నారు. సుమారు నెల రోజుల పాటు బ్యాంక్‌లు తమ కార్యకలాపాలన్నీ ప్రజల వద్ద ఉన్న పెద్ద నోట్లను సేకరించడానికి, సేకరించిన నగదును కట్టుదిట్టమైన భద్రత మధ్య పూలింగ్ స్టేషన్‌లకు తరలించడమే పనిగా వుండేది. అప్పటి వరకూ 74 శాతం చలామణిలో ఉన్న రూ. 1000 నోట్లు ప్రకటన తర్వాత 107 శాతం చలామణి పెరిగిపోయింది. ప్రజలు తమ వద్ద వున్న రూ. 500, 1000 నోట్లను బ్యాంకుల వద్ద బారులు తీరి మరీ జమ చేశారు. వీటితో పాటు తమకు కావలసిన నగదు కోసం బ్యాంక్‌ల ఎదుట బారులు తీరారు. ఈ కాలంలో ప్రజలు తమ వైద్య అవసరాల కోసం, శుభకార్యాల ఖర్చులకు నగదు కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. జిల్లాలో సుమారు 1500 పైగా వివిధ బ్యాంక్ బ్రాంచీల ద్వారా రోజూ సుమారు రూ. 10,000 కోట్ల నుంచి 12,000 కోట్ల వరకూ పెద్ద నోట్లను బ్యాంక్‌లలో జమ చేసేవారు.

నగదు కోసం పడిగాపులు...

కొత్తగా ప్రవేశపెట్టిన రూ. 500, రూ. 2000 నోట్లను పొందడం కోసం బ్యాంక్‌ల ముందు గంటల తరబడి ప్రజలు నిరీక్షించేవారు. బ్యాంక్‌లు మొదట ఖాతా ఉన్న ఒక వ్యక్తికి రూ. 2,500 ఇవ్వడం ప్రారంభించాయి. ఇలా ఇచ్చిన రూ. 2000 నోటుకు చిల్లర కోసం కూడా అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. నోట్ల రద్దు తర్వాత ఏటీఎంలలో సరిగా నగదు నిల్వలు లేకపోవడంతో నగదు కోసం ఏటీఎంల వద్ద భారీ లైన్‌లలో నిలబడలేక అనేక మంది ప్రాణాలు కోల్పోయారు. సరిగ్గా ఇలాంటి సమయంలోనే నగదు రహిత లావాదేవీలను ప్రోత్సహించేందుకు ఆన్‌లైన్ చెల్లింపులను చేపట్టడం జరిగింది. ఆర్థిక వ్యవస్థలో నగదు లావాదేవీల స్థానంలో ఆన్‌లైన్ చెల్లింపుల ప్రక్రియ ద్వారా ఆర్థిక అవసరాలు తీర్చడంలో నగదు నిల్వల పాత్ర తగ్గినప్పటికీ ఆన్‌లైన్ మోసాల కారణంగా ఆర్థికంగా నష్టపోవడం జరుగుతోంది.



మంచే జరిగింది

పెద్ద నోట్ల రద్దు వల్ల ప్రజలు ఇబ్బందులు పడటం వాస్తవమే అయినప్పటికీ తర్వాత వచ్చిన మార్పులతో చిన్న వ్యాపారులకు, వినియోగదారులకు మేలు జరిగింది. నగదు కొరత వల్ల కొత్తగా వచ్చిన ఆన్‌లైన్, యూపీఐ చెల్లింపుల విధానంతో వ్యాపారాలు సులభతరమయ్యాయి. చిన్న వ్యాపారుల్లో ఎక్కువ శాతం నిరక్షరాశ్యులు కావడంతో ఇబ్బందులు వచ్చినా క్రమేణా ఆర్థిక లావాదేవీలన్నీ సులభంగాను, సురక్షితంగా మారిపోయాయి. గతంలో 75 శాతం ఆర్థిక వ్యవహారాలన్నీ నగదును లెక్కించడంలోనే సమయం వృధాగా పోయేది. ఇప్పుడు యూపీఐ ద్వారా వ్యాపారాలన్నీ సురక్షితంగా, నగదు రహితంగా మారిపోయాయి.

-గమిని రాంబాబు, చాంబర్ ఆఫ్ కామర్స్ మాజీ అధ్యక్షుడు, తణుకు.



ఉపద్రవాలే ఎక్కువ...

పెద్ద నోట్ల రద్దు ఉద్దేశం మంచిదే కానీ ఉపద్రవాలే ఎక్కువగా జరిగాయి. ఆశించిన స్థాయిలో నల్లధనం నిర్మూలన జరగలేదు. నకిలీ నోట్ల చలామణి ఆగలేదు. రద్దైన కరెన్సీ 15.41 లక్షల కోట్ల నోట్లు కాగా వెనక్కి వచ్చింది 15.03 లక్షల కోట్లు. అంటే 99 శాతం వెనక్కి వచ్చింది. ఈ కారణంగా జమైన నోట్లకు సమానంగా కొత్త నోట్లను జారీ చేయడానికి బ్యాంక్‌లు ప్రయాస పడవలసి పరిస్థితి ఏర్పడింది. కరెన్సీ ముద్రణ భారం బ్యాంక్‌లపై పడింది. 2015-16లో 8 శాతం ఉన్న దేశ స్థూల జాతీయోత్పత్తి (జీడీపీ) 2016-17లో 5 శాతానికి పడిపోయింది. అసంఘటిత రంగంలో ఉపాధి అవకాశాలు, ఉన్న ఉపాధి తగ్గిపోయింది.

-డాక్టర్ జే. చంద్రప్రసాద్, రిటైర్డ్ ప్రిన్సిపాల్, ఆర్థికవేత్త, తణుకు.

నిత్యావసరాల ధరలు నియంత్రించాలి


మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు

ఏలూరు కార్పొరేషన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): నిత్యావసర సరుకుల ధరలు నియంత్రించాలని, ప్రజాపంపిణీ ద్వారా 14 రకాల సరుకులు అందించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ డిమాండ్ చేశారు. శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడుతూ భూమి, ఉపాధి హామీ, ఇళ్ళ స్థలాలు, పామాయిల్ కార్మికులు, నర్సరీ కార్మికులు, ఆక్వా కార్మికుల సమస్యలపై రానున్న మూడేళ్ల కాలంలో ఉద్యమాలకు, పోరాటాలకు 32వ మహాసభ నాంది అవుతుందని అన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 5, 6 తేదీల్లో టి.నర్సాపురం మండలంలో 32వ మహాసభలు నిర్వహించామని చెప్పారు. నూతన కార్యవర్గాన్ని 31 మందితో ఏకగ్రీవంగా మహాసభ ప్రతినిధులు ఎన్నుకోవడం జరిగిందన్నారు. ఎస్.కోటేశ్వరరావును జిల్లా కమిటీ శాశ్వత ఆహ్వానితునిగా ఎన్నుకున్నామని, 10 తీర్మానాలకు మహాసభ ఆమోదం తెలిపిందన్నారు. పాలకులు భూ పంపకంపై ఆలోచించలేదని దుయ్యబట్టారు.


మత్స్యశాఖ జేసీతో వీసీలో మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

ఆక్వా రైతుల అభివృద్ధికి
సహకారం అందించండి : కలెక్టర్

భీమవరం టౌన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఆక్వా రైతుల అభివృద్ధికి సహకారం అందించాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి కోరారు. శుక్రవారం న్యూఢిల్లీ నుంచి కేంద్ర మత్స్యశాఖ జాయింట్ సెక్రటరీ నీతుకుమారి ప్రసాద్ జిల్లా కలెక్టర్లు, మత్స్యశాఖ అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ జిల్లాలో నరసాపురం, మొగల్తూరు, యలమంచిలి, భీమవరం మండలాల్లో బ్రాకిష్ వాటర్ ఆక్వా సాగు జరుగుతోందన్నారు. జిల్లాలో ఉన్న ఆక్వా రైతులకు కల్పించవలసిన మౌలిక సదు పాయాలపై వివరించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో మత్స్య శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఎల్ఎల్ఎన్ రాజు, ఏడీ సీహెచ్. రాంబాబు, ఎఫ్డీవో బి.శరత్, డీపీఎం ఎం.నరేష్ తదితరులు పాల్గొన్నారు.



దెబ్బతిన్న రహదారులపై సమీక్షిస్తున్న జడ్పీ చైర్మన్ పద్మశ్రీ

రహదారుల మరమ్మతులు చేపట్టండి: పద్మశ్రీ

ఏలూరు సిటీ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ వల్ల జిల్లాలోని అనేక గ్రామీణ రహదారులు తీవ్రంగా దెబ్బతిని ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, తక్షణమే చర్యలు తీసుకోవాలని జడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ అధికారులను ఆదేశించారు. తుపాన్‌కు దెబ్బతిన్న రహదారులపై శుక్రవారం జడ్పీ కార్యాలయంలో పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ అధికారులతో ఆమె సమీక్షించారు. అధికారులు ప్రతి మండల స్థాయిలో రోడ్ల నష్టం వివరాలను సేకరించి, అత్యవసర మార్గాలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. గుంతలు పూడ్చటం, డ్రెయినేజి శుభ్రపరచటం, నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలని, తదుపరి దశలో నష్టానికి సంబంధించిన అంచనాలను సిద్ధం చేసి మైనర్ రిపేర్లకు జిల్లా పరిషత్‌కు ప్రతిపాదనలు పంపించాలని సూచించారు. జడ్పీ సీఈఓ ఎం. శ్రీహరి, డిప్యూటీ సీఈఓ కె. భీమేశ్వర్, పంచాయతీరాజ్ ఎస్ఈ రమేష్, ఈఈలు, డీఈలు, అన్ని మండలాల ఏఈలు పాల్గొన్నారు.

దేవదాయ, ధర్మదాయ శాఖలో పదోన్నతులు

భీమవరం టౌన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): దేవదాయ ధర్మదాయ శాఖలో పలు ఆలయాల్లో పనిచేస్తున్న థర్డ్ గ్రేడ్ ఈవోలకు సెకండ్ గ్రేడ్ ఈవోలుగా పదోన్నతి లభించింది. జోన్-2 పరిధిలో 13 మందికి పదోన్నతి రాగా పశ్చిమ నుంచి 7 గురికి లభించింది. కృష్ణా, పశ్చిమ, తూర్పుగోదావరి జిల్లాల్లో గ్రేడ్-2 ఈవో పోస్టుల్లో వీరిని భర్తీ చేస్తారు. పదోన్నతి పొందిన వారిలో ఎన్. రంగరాజన్, వి. నాగ కేశవ శేఖర్, జి. లోకేశ్వరరావు, ఆర్‌వీవీఎస్ రామచంద్ర కుమార్, శింగనపల్లి శ్రీనివాస రావు, ఎం. శ్రీనివాసరావు, పి. కృష్ణారెడ్డి, టీవీవీ మోహన్‌రావు, వి. జశ్వంత్ కేదార్, కె. రామచంద్రరావు, వి. ఉషా సంధ్య, పి. రీనా మాధురి, వి. శ్రీనివాసరాజ ఉన్నారు.

బావా బయటకు రా.. స్నేహితుడిని చాకుతో పొడిచి హత్య

క్రైం సమాచారం


హరికృష్ణ (ఫైల్)

ఏలూరు క్రైం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): 'హత్య చేయవద్దు అని వారించిన స్నేహితుడినే అకస్మాత్తుగా కూరగాయలు తరిగే చాకుతో ఒకేఒక్క పోటుపొడిచి హతమార్చిన ఘటన ఏలూరు నగర సమీపంలోని గణేష్‌కాలనీలో శుక్రవారం సాయంత్రం జరిగింది. మృతుడి బంధువులు తెలిపిన వివరాలివి.. ఏలూరు రూరల్ మండలం సాయినగర్ సమీపంలోని గణేష్ కాలనీలో నమ్మి హరికృష్ణ(32) తాపీ పనులు చేస్తూ ఉంటాడు. అతడికి భార్య రాజేశ్వరి, కుమారుడు మహేష్, కుమార్తె కీర్తి ఉన్నారు. రాజేశ్వరి ఏలూరులోని ఒక షాపింగ్ మాల్‌లో సెక్యూరిటీగా పనిచేస్తుంది. కుమారుడు మహేష్ (ఆరో తరగతి) కుమార్తె కీర్తి ఏడో తరగతి చదువుతుంది. హరికృష్ణ చెడు స్నేహం వల్ల గంజాయికి బానిస కావడంతో ఇటీవల పోలీసులకు చిక్కాడు. సత్ప్రవర్తనతో జీవిస్తున్నాడు. అతడి స్నేహితుడైన అదేకాలనీలో నివాసం ఉంటున్న నాయక్ దీపక్ ఏలూరు ఆర్ఆర్‌పేటలో ఒక హోటల్‌లో టీ మాస్టర్‌గా పనిచేస్తున్నాడు. నాయక్ దీపక్‌కు నాని అనే యువకుడికి గొడవలు ఉన్నాయి. నాని అనే యువకుడు ఒక హత్య కేసులో అరెస్టు కాబడి ఇటీవల బెయిల్‌పై విడుదల అయ్యాడు. నానికి, దీపక్‌కు పాత గొడవలు ఉన్నాయి. నానికి హరికృష్ణకు స్నేహం ఉంది. హరికృష్ణతో దీపక్‌కు స్నేహం ఉంది. నాని తనను చంపివేస్తానని అంటున్నాడని తానే చంపి వేస్తానని అతడు ఎక్కడ ఉన్నాడో చెప్పాలంటూ ఈనెల 6వ తేదీన దీపక్ అడిగి హరికృష్ణతో గొడవ పడ్డాడు. మళ్లీ శుక్రవారం సాయంత్రం హరికృష్ణ ఇంట్లో ఉండగా అతడి కుమారుడు మహేష్ స్నేహితులతో ఆడుకుంటున్న సమయంలో దీపక్ వచ్చి 'బావా బయటకు రా' అంటూ హరికృష్ణను పిలిచాడు. బయటకు వచ్చిన హరికృష్ణను నాని ఎక్కడ ఉన్నాడో చెప్పాలని, తాను చెప్పమన్న సంగతి చెప్పావా అంటూ ప్రశ్నించారు. దీంతో హరికృష్ణ కోపగిం చుకుని చేతులతో తోశాడు. ఆగ్రహించిన దీపక్ అప్పటికే తనతో తెచ్చుకున్న కూరగాయల చాకుతో ఉదర భాగంలో ఒక పోటు పొడిచాడు. ఆపై నానిని కూడా లేపేస్తానంటూ మరో పెద్ద కత్తిని చేతితో తిప్పుకుంటూ అక్కడ నుంచి వెళ్లిపోయాడు. రక్తపు మడుగులో ఉన్న హరికృష్ణను ఇరుగు పొరుగు వారు, కుటుంబ సభ్యులు కలిసి ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకు వచ్చారు. ఆసుపత్రి వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందాడని నిర్ధారించారు.

ఈ ఘటనపై ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేసి ఆసుపత్రి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రి మార్చురీకి తరలించారు. మరోవైపు వన్ టౌన్ సీఐ జి. సత్యనారాయణ, వన్‌టౌన్ ఎస్ఐ సీహెచ్ దుర్గా ప్రసాద్, ఏలూరు రూరల్ ఎస్ఐ వి.నాగబాబు వారి సిబ్బంది కలిసి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. హంతకుడి కోసం గాలింపు చేపట్టారు. ఏలూరు రూరల్ మండలం కొమడవోలులో రాజేష్ అనే యువకుడిని, అతని స్నేహితుడే పాతగొడవలు నేపథ్యంలో ఇంటికి వచ్చి బావా అని బయటకు పిలిచి కత్తులతో నరికి హతమార్చాడు. అదే తరహాలో హత్య చేయడంతో నగరంలో ఈ హత్యలు తీవ్ర కలకలం సృష్టిస్తున్నాయి.

ఉరి వేసుకుని వైసీపీ నాయకుడి ఆత్మహత్య

తణుకు రూరల్, నవంబరు7(ఆంధ్రజ్యోతి):గతంలో తణుకు నియోజకవర్గ వైసీపీ యూత్ అధ్యక్షుడిగా వ్యవహరించిన వీరమల్లు ఫణీంద్రకుమార్ (45) గురువారం రాత్రి తణుకులోని ఆయన నివాసంలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్ప డ్డాడు. మృతుడికి తల్లి, భార్య, ఇద్దరు కుమారులున్నారు. అతడి మృతికి కారణాలు తెలియరాలేదని పోలీసులు తెలిపారు. ఈ మృతిపై తణుకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలిం చినట్లు పోలీసులు తెలిపారు.

గోదావరి స్నానానికి వెళ్లి..
అయ్యప్ప భక్తుడు గల్లంతు


నాగార్జున (ఫైల్)

కుక్కునూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బెస్తగూడెం గ్రామానికి చెందిన కుమ్మరపల్లి నాగార్జున(25) అనే అయ్యప్పభక్తుడు గోదావరి స్నానానికి వెళ్లి గల్లంతయ్యాడు. అదే గ్రామానికి చెందిన మరో పది మంది అయ్యప్ప దీక్ష మాలధారులతో స్నానానికి వెళ్లాడు. గోదావరిలోకి స్నానానికి దిగడంతో లోతుగా ఉండడంతో మునిగిపోయాడు. వెళ్లిన వారికి ఈత రాకపోవడంతో కాపాడలేని పరిస్థితి ఏర్పడింది. ఈ సమాచారం తెలిసిన వెంటనే సీఐ రమేశ్‌బాబు, వేలేరుపాడు ఎస్ఐ నవీన్‌కుమార్ సంఘటన స్థలానికి చేరి గాలింపు చర్యలు చేపట్టారు. సాయంత్రం వరకు ఆచూకీ దొరకలేదు. కుమ్మరపల్లి పెదవెంకటేశ్వర్లు, శిరోమణి భార్యభర్తలు కాగా వారికి నలుగురు కుమార్తెలతో పాటు గల్లంతైన నాగార్జున ఏకైక కుమారుడు. వారు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. గోదావరి స్నానానికి వెళ్లే సమయంలో ఇంట్లో కుటుంబసభ్యులు వద్దని వాదించారు. గోదావరి రేవు వద్ద ఓ నాగుపాము పడగ విడిచి వీరికి అడ్డుగా వచ్చింది. అనంతరం పాము పక్కకు వెళ్లిన తరువాత అయ్యప్పస్వాములు గోదావరి స్నానానికి వెళ్లారు. నాగుపాము ఎదురుగా వచ్చి స్నానానికి వెళ్లవద్దని హెచ్చరికపంపినప్పటికీ గుర్తించలేకపోయామని అయ్యప్పస్వామి భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


సవాల్ విసిరిన సెల్‌ఫోన్ వీడియోతో నిందితుడిని ప్రశ్నిస్తున్న ఏలూరు జిల్లా ఎస్పీ కిశోర్

పోలీసులకే సవాల్ విసిరిన నేరస్తుడు

- ఐదుగురు నిందితుల అరెస్ట్.. 12 మోటారు సైకిళ్లు స్వాధీనం

ఏలూరుక్రైం:గంజాయి, చెడు వ్యసనాలకు బానిసలైన యువకులు మోటారు సైకిళ్ల తాళాలు పగులగొట్టి వాటిని తస్కరించి వాటితోనే నేరాలు చేస్తున్నారు. అంతేకాకుండా ఏకంగా పోలీసులకే ఒక దొంగ సవాల్ విసిరాడు. 'తాను డ్యూక్ బైక్ తస్కరించానని తనపై రెండు కేసులు ఉన్నాయని వంద బైక్‌లు దొంగతనం చేశానని దమ్ముంటే నన్ను పట్టుకోండి, అని ఏమి చేస్తారో చేసుకోండి' అంటూ సవాల్ విసిరాడు. ఈవిధంగా సవాల్ చేసిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఏలూరు జిల్లా ఎస్పీ కిశోర్ ఆదేశాలతో నూజివీడు టౌన్ సీఐ పి.సత్య శ్రీనివాస్ ఆధ్వర్యంలో ప్రత్యేక పోలీస్ బృందం ఆ వీడియో ఆధారంగా శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి ఈనెల 6న నూజివీడు రామానుగూడెం రోడ్డులో డంపింగ్ యార్డు వద్ద ఐదుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు.

పోలీసులకు సవాల్ విసిరిన నూజివీడు పట్టణంలో రెల్లిపేటకు చెందిన దళాయి గణేష్ అలియాస్ నాగపవన్ గణేష్, నూజివీడులోని గాంధీనగర్‌కు చెందిన షేక్ మెహర్ బాబా, నూజివీడు మండలం గొల్లపల్లికి చెందిన చౌటపల్లి శుభాష్ అలియాస్ సుబ్బు, నూజివీడులోని ఎంఆర్ అప్పారావు కాలనీకి చెందిన షేక్ ఆసిఫ్ ఉల్లా అలియాస్ ఆసీఫ్, చిత్తూరి అజయ్‌కుమార్ అలియాస్ అజయ్‌లను అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి సుమారు రూ.9.08 లక్షల విలువైన 12 మోటారు సైకిళ్లు స్వాధీనం చేసుకున్నారు.

గణేశ్‌ను ప్రశ్నించిన ఎస్పీ..

ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం మధ్యాహ్నం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా ఎస్పీ కిశోర్ అక్కడ ఉన్న నేరస్తుడు దళాయి గణేష్‌ను ప్రశ్నించారు. పోలీసులకు ఏ విధంగా సవాల్ విసిరావో మరోసారి చెప్పు అనగానే గణేష్‌కు చుక్కలు కనిపించాయి. తాగిన మైకంలో మాట్లాడానని తప్పయిందంటూ ఇంకెప్పుడు అలా మాట్లాడనని.. నేరాలు చేయనంటూ ఒప్పుకోలు మొదలు పెట్టాడు. నేరస్తులను అరెస్టు చేయడంలో ప్రతిభ కనబర్చిన పోలీసు అధికారులను అభినందించి ప్రశంసా పత్రాలను అందించారు. సమావేశంలో అదనపు ఎస్పీ ఎన్. సూర్య చంద్రరావు, నూజి వీడు డీఎస్పీ ప్రసాద్, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

ఏడు టన్నుల రేషన్ బియ్యం పట్టివేత

ముగ్గురిపై కేసు నమోదు
ఏలూరు నుంచి కాకినాడ పోర్టుకు తరలింపు

నల్లజర్ల, నవంబరు7(ఆంధ్రజ్యోతి):ఏలూరు నుంచి కాకినాడ పోర్టుకు అక్రమంగా తరలిస్తున్న ఏడు టన్నుల రేషన్ బియ్యా న్ని, రెండు వ్యాన్లను విజిలెన్స్ సివిల్ సప్లై అధికారులు శుక్రవారం పట్టుకుని సీజ్ చేశారు. అనంతపల్లి టోల్‌ప్లాజా వద్ద విజిలెన్స్ సీఐ మధుబాబు, సివిల్ సప్లై డీటీ సత్యనారాయణ తన సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ చేస్తుండగా రేషన్ బియ్యం బయటపడ్డాయి. బియ్యం తరలిస్తున్న ముగ్గురిపై కేసు నమోదు చేశారు. సీజ్ చేసిన బియ్యాన్ని గోపాలపురం స్టాక్ పాయింట్‌కు చేర్చి వ్యాన్లను నల్లజర్ల పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

ఆటోలో పోయిన బ్యాగ్..

- గంటల వ్యవధిలో బాధితుడికి అప్పగించిన పోలీసులు

ఏలూరు క్రైం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఒక ప్రైవేటు కంపెనీలో పనిచేస్తున్న యువకుడు ఆ కంపెనీ పనిమీద ఏలూరు వచ్చి ఆటో ఎక్కాడు. ఆటోలో బ్యాగ్ మర్చిపోయాడు. చివరకు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో దర్యాప్తు చేపట్టి ఆటో డ్రైవర్‌ను గుర్తించి బ్యాగ్‌ను స్వాధీనం చేసుకుని శుక్రవారం రాత్రి ఏలూరుటూటౌన్ సీఐ అశోక్‌కు మార్ బాధితుడికి అప్పగించారు. ముంబైక్ చెందిన కరీమ్ అనే యువకుడు హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్‌లో పనిచేస్తున్నారు. పెట్రోలు బంకులకు సంబంధించిన పనులపై తరచుగా పలు రాష్ట్రాలు వెళ్తూ ఉంటాడు. దీనిలో భాగంగా ఏలూరు కొత్త బస్టాండ్‌కు వచ్చి అక్కడ నుంచి ఆటోలో ఈనెల 6వ తేదీ మధ్యాహ్నం సమయంలో ఏలూరు పాతబస్టాండ్ సమీపంలో ఉన్న పెట్రోల్ బంకు వద్దకు వెళ్లాడు. ఆ ఆటోలో బ్యాగ్ మర్చిపోయాడు. అనంతరం ఆటో కోసం ఎంత వెతికినా ఆచూకీ కానరాలేదు. శుక్రవారం ఏలూరు టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సీఐ కె అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో ఏఎస్ఐ రాము వారి సిబ్బంది కలిసి శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి ఆ బ్యాగ్‌ను గుర్తించారు. ఆటో డ్రైవర్ ఏలూరు వట్లూరుకు చెందిన చాంద్‌బాషా ఆ బ్యాగ్‌ను ఇంట్లో పెట్టుకున్నాడు. అతడిని, బ్యాగ్‌ను స్వాధీనం చేసుకుని బాధితుడు కరీమ్‌కు బ్యాగ్ అప్పగించారు. ఆటో డ్రైవర్‌కు కౌన్సెలింగ్ చేశారు.

ఆటో నుంచి మంటలు.. రూ.లక్ష నష్టం

ఏలూరు క్రైం : ఒక షాపింగ్ మాల్ సెల్లార్‌లో పార్కింగ్ చేసిన ఆటో నుంచి అగ్ని ప్రమాదం సంభవించి ఆటోలోని వస్తువులు దగ్ధమయ్యాయి. ఏలూరు పత్తేబాదలో ఉన్న రిలయన్స్ మాల్ సెల్లార్‌లో శుక్రవారం సాయంత్రం ఒక ఆటో పార్క్ చేశారు. ఆ ఆటోలో ఎలక్ట్రికల్ వస్తువులు ఉన్నాయి. ఆటో బ్యాటరీ నుంచి మంటలు వ్యాపించాయి. సమాచారం అందుకున్న ఏలూరు ఫైర్ సిబ్బంది మంటలను అదుపు చేశారు. సుమారు లక్షల రూపాయల నష్టం వాటిల్లిందని అగినమాపక శాఖ అధికారులు వెల్లడించారు.

కొత్తముప్పర్రులో బైక్ చోరీ

పెదపాడు, నవంబరు7(ఆంధ్రజ్యోతి): తన మోటారు సైకిల్‌ను గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించారని పెదపాడు మండలం కొత్తము ప్పర్రు గ్రామానికి చెందిన కోట శ్రీనివాసరావు ఫిర్యాదు చేశారని ఎస్ఐ కట్టా శారదాసతీష్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాలి.. ఈనెల 2వ తేదీ రాత్రి 9 గంటలకు తన ఇంటి ఎదురుగా నిలిపివుంచిన మోటారుసైకిల్‌ను ఇంటి ఎదురుగా తాళం వేసి పడుకోగా, మరుసటి రోజు ఉదయం లేచి చూసేసరికి కన్పించలేదని ఫిర్యాదులో పేర్కొ న్నాడు. పెదపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

టీచర్లకు 'కేపీఐ' వద్దు : ఏపీటీఎఫ్

ఏలూరు అర్బన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : టీచర్ల పనితీరుని కొలమానంగా తీసుకుని వారికి కీ పెర్ఫార్మెన్స్ ఇండికేటర్స్(కేపీఐ)ను కేటాయించే ప్రతిపాదనలను విద్యాశాఖ ఉపసంహరించుకోవాలని ఏపీటీఎఫ్ జిల్లాశాఖ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు రామారావు, రెడ్డిదొర డిమాండ్ చేశారు. కేపీఐ విధానం వల్ల రాజకీయజోక్యం ప్రవేశించే ప్రమాదం ఉందని, విద్యావ్యవస్థ గాడితప్పే అవకాశం ఉందన్నారు. ఈ ప్రతిపాదనలకు ఏపీటీఎఫ్ వ్యతిరేకమని, సాధారణ బదిలీల చట్టం నిబంధనల మేరకే ఉపాధ్యాయులకు బదిలీలు ఉండాలని కోరారు.

అడవిలో మొక్కల పెరుగుదలపై సబ్ డీఎఫ్‌వో ఆరా

జీలుగుమిల్లి, నవంబరు 7 :(ఆంధ్రజ్యోతి) : కామయ్యపాలెం, జీలుగుమిల్లి ఫారెస్ట్ బీట్‌లో ఇటీవల నాటిన మారుజాతి మొక్కల్ని సబ్ డీఎఫ్‌వో సుబ్బయ్య శుక్రవారం పరిశీలించారు. ఈ ఏడాది వర్షాలు పడడంతో ప్లాంటేషన్‌లో మొక్కలు ఏపుగా పెరిగాయన్నారు. సంరక్షణ బాధ్యత నిత్యం అటవీ నిఘా సిబ్బందితో చర్చించారు. ఎఫ్ఆర్‌వో దుర్గాకుమార్, డీఆర్‌వో ధర్మారావు, ఎఫ్‌బీవోలు మారేష్, ఏసుపండు ఉన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించండి

» పీఆర్‌అండ్ ఆర్డీ కమిషనర్‌కు ఎమ్మెల్యే చింతమనేని వినతి


సీతంపేటలో ధాన్యం కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చింతమనేని

పెదవేగి/దెందులూరు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): దెందులూరు నియోజకవర్గంలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని పీఆర్‌అండ్‌ఆర్డీ కమిషనర్ శ్రీకృష్ణతేజను శుక్రవారం గుంటూరు కార్యాలయంలో ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ కలిసి అంచనాలతో కూడిన వినతిపత్రాన్ని అందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో తాగునీటి ఎద్దడి నివారణకు 76 కిలోమీటర్ల దూరంలోని ధవలేశ్వరం ప్రాజెక్టునుంచి గోదావరి జలాలను తరలించడానికి పైపులైను నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధంచేశారన్నారు. పోలవరం కుడి ప్రధాన కాలువనుంచి కృష్ణా నదికి వెళ్తున్న గోదావరి జలాలను కొప్పాక దగ్గర హెడ్ రెగ్యులేటర్‌ను నిర్మిస్తే వ్యయం భారీగా తగ్గుతుందన్నారు. త్వరితగతిన పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కోరామని చెప్పారు. చెత్త సేకరణలో వినూత్నంగా అమలవుతున్న స్వచ్ఛరథాన్ని నియోజకవర్గానికి మంజూరు చేయాలని, గతంలో నిలిచిన పెండింగ్ బకాయిలను విడుదల చేయాలని విజ్ఞప్తి చేశామని తెలిపారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. శుక్రవారం దెందులూరు మండలం సీతంపేట సహకార సంఘం బ్యాంక్ కార్యాలయ ఆవరణలో బ్యాంక్ అధ్యక్షుడు యలమర్తి వీరవెంకట సత్యనారాయణతో కలిసి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని, పెదవేగి మండలం ముండూరు సొసైటీలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం దెందులూరులో వ్యవసాయశాఖ జేడీ హబీబ్ బాషా, ఏడీ అనిల్‌కుమారి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఏవో ఎల్.శ్రీనివాసరాజు, మాజీ సర్పంచ్‌లు పరసా వెంకట్రావు, ముమ్మడి మోహన్‌రావు, పాటేశ్వరావు, ఏఎంసీ డైరెక్టర్ వైవకా రాజా, బ్యాంక్ కార్యదర్శి పెద్దిరాజు, డైరెక్టర్లు నర్రావుల గంగభవాని, రామచంద్రరావు తదితరులు ఉన్నారు. ముండూరులో సొసైటీ ఛైర్మన్ కొనకళ్ల శివమణి, కార్యదర్శి బీవీఎస్వీప్రసాదరావు, పార్టీ నాయకులు బలుసు శ్రీనివాస్‌చౌదరి, సుజాన్, లోకేశ్వర శ్రీనివాస్, కార్తీక్, ఆలూరి గంగాధరరావు తదితరులు పాల్గొన్నారు.

ద్వారకాతిరుమలలో నాలుగు ధాన్యం కేంద్రాలు

ద్వారకాతిరుమల, నవంబరు7(ఆంధ్రజ్యోతి): గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు ఆదేశాలతో ద్వారకాతిరుమల మండలంలో నాలుగు రైతు సేవా కేంద్రాలలో నాలుగు ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాల్లో రైతులకు అవసరాల మేర గోనె సంచులను అందుబాటులో ఉంచారు. ధాన్యం అమ్మిన రైతులకు ఒక రోజులోనే డబ్బులు జమచేసేలా చర్యలు తీసుకున్నట్టు అధికారులు తెలిపారు. గ్రేడ్-ఏ రకం ధాన్యానికి గత ఏడాదికంటే రూ.69 రేటు పెంచి క్వింటా రూ.2,389 పలుకుతోందని అధికారులు అంటున్నారు.

ప్రజాసమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం


అర్జీలు స్వీకరిస్తున్న ట్రైకార్ ఛైర్మన్ శ్రీనివాసులు

పోలవరం, నవంబరు7(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వ లక్ష్యంగా పాలన సాగిస్తోందని ఏపీ ట్రైకార్ ఛైర్మన్ బొరగం శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం పోలవరంలో ఆయన నివాసం వద్ద జరిగిన గ్రీవెన్స్ కార్యక్రమంలో పలువురు మండల సమస్యలపై ఆయనకు అర్జీలు అందజేశారు. వీటిలో కొన్ని సమస్యలపై అధికారులతో మాట్లాడి అక్కడే పరిష్కారం చేశారు. ఇతర సమ స్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కూటమి నేతలు జీసీసీ డైరెక్టర్ మడకం కన్నపరాజు, నునకాని రాంబాబు, సీనియర్ నాయకులు కుంచే దొరబాబు, పాపోలు రత్తయ్య, జల్లేపల్లి పెద్ద అబ్బులు, పొట్టా రామారావు, కరిబండి నాగరాజు, కొణతాల ప్రసాద్, వలవల శ్రీనివాస్, పూడి వెంకట్రావు, డోకుల నాగేశ్వరరావు, కోడి శ్రీనివాస్, పాదం ప్రసాద్ పాల్గొన్నారు.

'రోడ్డు ప్రమాదాలపై ముందస్తు చర్యలు తీసుకోవాలి'

ఏలూరు క్రైం, నవంబరు7(ఆంధ్రజ్యోతి): ఇంటిగ్రేటెడ్ రోడ్డు యాక్సిడెంట్ డేటా బేస్ (ఐరాడ్) ద్వారా ప్రమాదాలు జరిగిన ప్రాంతాలను వాటికి గల కారణాలను విశ్లేషించి భవిష్యత్తులో ప్రమాదాలు జరుగకుండా ముందస్తుగా చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు ఎస్పీ ఎన్.సూర్యచంద్రరావు సూచించారు. ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం రోడ్డు ప్రమాదాల నియంత్రణపై పోలీసులకు ఐరాడ్ అవగాహన సదస్సును నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలకు సంబంధించిన డేటాను శాస్త్రీయంగా సేకరించి దానిని కేంద్రీకృత వ్యవస్థలో నమోదు చేయడానికి ఐరాడ్ ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. ఈ సదస్సును నేషనల్ ఇన్ఫర్మేటిక్ సెంటర్ అధికారుల సహకారంతో నిర్వహించారు. సదస్సులో ఎన్ఐజీ అధికారులతో పాటు ఏలూరు జిల్లాలోని రోడ్డు సేఫ్టీ మొబైల్ సిబ్బంది, ఇ-కాప్స్ కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

ఆడమిల్లిలో కార్తీక దీపోత్సవం

కామవరపుకోట, నవంబరు7(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం నేపథ్యంలో శుక్రవారం ఆడమిల్లిలోని కంచి కామాక్షి సమేత ఏకాంబరేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో గ్రామ సర్పంచ్ గూడపాటి కేశవరావు దంపతులు కార్తీక దీపోత్సవ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. అర్చకులు బ్రహ్మశ్రీ పర్సా సాయి కృష్ణమాచార్యులు కార్తీకమాస మహోత్సవాన్ని వివరించారు. అనంతరం అన్నప్రసాద వితరణను నిర్వహించారు. గ్రామస్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వీటి సంగతి ఇంతేనా?

(5వ పేజీ తరువాయి)

స్థిరీకరణ జరిగితే ఏ పంట కాల్వల కింద ఎంత ఆయకట్టులో వరి సాగు, వేరుశనగ సాగు జరుగుతున్నదీ, ఎంత ఆయకట్టులో ఆక్వా సాగు జరుగుతున్నదీ నమోదై సాగునీటిని ఏయే కాల్వకు ఎంత పరిమాణంలో విడుదల చేయాలో తెలుస్తుంది. ఆ లెక్కలు లేక నోటిఫై అయిన ఆయకట్టుకే అధికారులు నీరు విడుదల చేస్తున్నారు.

శిస్తులు మామూలే

నోటిఫైడ్ పంట కాల్వల కింద సాగు చేస్తున్న రైతులతో పాటే నాన్ - నోటిఫైడ్ కాల్వల కింద సాగు చేస్తున్న రైతులూ నీటి తీరువా చెల్లిస్తున్నారు. నాన్ - నోటిఫైడ్ కాల్వలను నోటిఫై చేయాలని గత 50 ఏళ్లుగా రైతులు ప్రభుత్వాలకు చేసిన విజ్ఞప్తులు బుట్టదాఖలు అయ్యాయే తప్ప కైకలూరు నియోజకవర్గంలోని ఒక నాన్ - నోటిఫైడ్ పంట కాల్వ కూడా నోటిఫై కాలేదు.

దళారులదే రాజ్యం !

(5వ పేజీ తరువాయి)

ఉండడంపై తీవ్ర దుమారం రేగింది. కొంత మంది ఉన్నతస్థాయిలో ఫిర్యాదులు చేశారు. దీనిపై విచారణలను పూర్తి చేసిన ఉన్నతాధికారులు సబ్ రిజిస్ట్రార్‌తో పాటు, కింద స్థాయి సిబ్బందిని చాలావరకు వివిధ ప్రాంతాలకు బదిలీ చేశారు. భీమడోలు లోను పాత సిబ్బంది అక్కడ తిష్టవేసి అక్రమ లావాదేవీలను నిర్వహిస్తున్నారన్న ఆరోపణలు రాగా జిల్లా రిజిస్ట్రార్ కె.శ్రీనివాసరావు స్వయం గా రికార్డులను పరిశీలించి, అక్కడ సిబ్బందికి హెచ్చరికలు జారీ చేశారు. ఎవరికి లంచాలు ఇవ్వనక్కర్లేదని బహిరంగంగానే ప్రకటించారు.

అధికారులకు ప్రైవేట్ సిబ్బంది

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు అవినీతికి అడ్డాగా మారాయి. కొందరు అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. దళారీ వ్యవస్థను ప్రోత్సహిస్తూ- అడ్డగోలు వ్యవహారాలతో జేబులు నింపుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. కొందరు అధికారులు వసూళ్ల కోసమే ప్రత్యేకంగా సిబ్బంది నియమించుకున్నారంటే పరిస్థితి ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. ఫిర్యాదులు అందిన సమయంలో అడపాదడపా విచారణలు జరిపి వదిలేస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి.ఉన్నతాధికారులు కఠిన చర్యలు తీసుకుంటే వీరి ఆగడాలకు అడ్డుకట్ట పడుతుందని పలువురు కోరుతున్నారు.


ఏలూరు జడ్పీ కార్యాలయంలో వందేమాతరం కార్యక్రమంలో జడ్పీ చైర్‌పర్సన్, జడ్పీ సీఈవో


చింతలపూడిలో వందేమాతరం వేడుకల్లో ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్, విద్యార్థులు


ఏలూరులో వందేమాతరం గేయం ఆలపిస్తున్న వైఎంహెచ్‌ఏ ప్రతినిధులు

భారతీయ ఆత్మకు ప్రతీక 'వందేమాతరం'

» జడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీప్రసాద్

జాతీయ గేయం రచించి 150 ఏళ్లు పూర్తయిన సందర్భంగా వేడుకలు

ఏలూరుసిటీ/ఏలూరుటూటౌన్/ఏలూరు అర్బన్/ఏలూరు రూరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): భారతీయ ఆత్మకు ప్రతీకగా నిలిచిన వందేమాతరం గేయం స్వాతంత్ర్య పోరాటంలో కోట్లాది మందికి స్ఫూర్తినిచ్చిందని జడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ అన్నారు. వందేమాతరం గేయం రచించి 150 ఏళ్ల పూర్తయిన సందర్భంగా శుక్రవారం జిల్లా పరిషత్‌లో జాతీయ గీతాలాపన కార్యక్రమం నిర్వహించారు. జడ్పీ సీఈవో ఎం.శ్రీహరి, డిప్యూటీ సీఈవో కె.భీమేశ్వర్, ఇతర జడ్పీ ఉద్యోగులు పాల్గొన్నారు. ఏలూరు నగరపాలక సంస్థ కార్యాలయంలో నగర పాలక సంస్థ కో-ఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు, కమిషనర్ భానుప్రతాప్ ఆధ్వర్యంలో వందేమాతరం గీతానికి 150 ఏళ్ల పూర్తయిన సందర్భంగా కార్యక్రమం నిర్వహించారు. కస్తూరిబాయి పాఠశాల విద్యార్థినిలు గీతాన్ని ఆలపించారు. కో-ఆప్షన్ సభ్యులు చోడే వెంకటరత్నం, కార్పొరేటర్లు ఎస్.శ్రీనివాసరావు, విజయకుమార్, పాము శామ్యూల్, మేనేజర్ మూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

ఏలూరు నగరంలోని పలు పాఠశాలల్లో గీతాలాపన జరిగింది. స్థానిక కస్తూరిబా మున్సిపల్ బాలికోన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు విక్రమ్‌కిశోర్ మాట్లాడారు. పార్టీ జిల్లా ప్రధానకార్యదర్శి గాది రాంబాబు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కట్నేని కృష్ణప్రసాద్, ఓబీసీ మోర్చా నాయకులు అనిల్ ఆచార్య, వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు. హిందూ యువజన సంఘం (వైఎంహెచ్‌ఏ) ఆధ్వర్యంలో ఏలూరు వైఎంహెచ్‌ఏ హాల్లో వందేమాతరం గేయం ప్రస్థానంపై ప్రత్యేక కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యనిర్వాహక కమిటీ అధ్యక్షుడు యిరదల ముద్దుకృష్ణ, ప్రధాన కార్యదర్శి మజ్జి సూర్యకాంతరావు, ఎల్. వెంకటేశ్వరరావు, కేబీ రావు, బొప్పన వెంకటరాజా, సీహెచ్‌సాయి తేజ, కానాల బాల వెంకట రమేష్ సభ్యులు హేమంత్‌కుమార్, కానాల మురళీకృష్ణ, పిలగల కొండలరావు, ఎం. సూర్యనారాయణ యాదవ్, మారం హనుమంతరావు, తదితరులు పాల్గొన్నారు.

● చింతలపూడి/లింగపాలెం: ప్రతీ ఒక్కరిలో దేశభక్తి ఉండాలని చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ అన్నారు. స్థానిక బాలికోన్నత పాఠశాలలో 200 మీటర్ల జాతీయ జెండాతో 500 మంది విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వందేమాతరం గేయాన్ని రచించిన బకించంద్ర ఛటర్జీ అహింసాయుత భారత స్వాతంత్ర్య ఉద్యమంలో ఈ వందేమాతరం రణనినాదంగా ఆలపించడానికి గేయాన్ని రాశారన్నారు. 1875వ సంవత్సరం నవంబరు 7న బెంగాలీ కవి చ టర్జీ ఈ గీతాన్ని రచించారన్నారు. ఈ సందర్భంగా ఏలూరుకు చెందిన రచయిత వందేమాతరం గీతాలాపన చేసిన సుభానీకి శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. హెచ్ఎం మాటూరి చక్రధరరావు, ఉపాధ్యాయులు, పట్టణ నాయకులు భారీగా పాల్గొన్నారు. లింగపాలెం మండలం లోని శ్రీవిద్యా పాఠశాలలో వందేమాతరం గీతం ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హెచ్ఎం జీహెచ్ రత్నాకర్, బీజేపీ జిల్లా కార్యదర్శి కె.సుబ్ర హ్మణ్యేశ్వరరావు, డి.సాయికృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

● బుట్టాయగూడెం : బుట్టాయగూడెం విద్యారోహిణి పబ్లిక్ స్కూల్ విద్యార్థులు ప్రిన్సిపాల్ కె.రామకృష్ణ ఆధ్వర్యంలో ఘనంగా వందేమాతర గీతాలాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. స్వాతంత్ర్య ఉద్యమంలో ఈ గీతంఈ ఎంత ప్రభావవంతంగా పనిచేసిందో ప్రిన్సిపాల్ వివరించారు. ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

● భీమడోలు : విద్యార్థులు స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను మరువరాదని తహసీల్దార్ రమాదేవి అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ రమాదేవి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో పద్మావతి దేవి అధ్యక్షతన కార్యక్రమాలు నిర్వహించారు. జాతీయ గీతం విశిష్టతను వివరించారు. పోలసానపల్లిలో సర్పంచ్ షేక్ రహీమా బేగం ఆధ్వర్యంలో ఎంపీపీ పాఠశాలలో విద్యార్థులు జాతీయ గీతాలాపన చేశారు.

'విభజించి-పాలించు'కు గొడ్డలిపెట్టు వందేమాతరం ఉద్యమం : రవికుమార్


వందేమాతరం గీతాలాపన చేస్తున్న ఎంపీడీవో తదితరులు

పెదవేగి : ఆనాటి బ్రిటీష్ పాలకులు పాటించిన విభజించి-పాలించు విధానానికి గొడ్డలిపెట్టుగా వందేమాతరం ఉద్యమం దోహదపడిందని పెదవేగి ఎంపీడీవో కె.రవికుమార్ అన్నారు. వందేమాతరం గీతం ఆలపించి 150 ఏళ్ల పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకుని నాటి స్మృతులను నేటితరానికి గుర్తుచేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం నిర్దేశించిన తరుణంలో పెదవేగి మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఉదయం పది గంటలకు వందేమాతరం గీతాలాపన చేశారు. గ్రామ సర్పంచ్ తాతా శ్రీరామ్మూర్తి, సొసైటీ అధ్యక్షుడు తాతా సత్యనారాయణ, గ్రామ కార్యదర్శి కేవీ.ప్రసాద్, జూనియర్ అసిస్టెంట్ అల్లీసాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్లలో ఏఎస్పీ సుస్మిత తనిఖీలు


చింతలపూడిలో సీఐ, ఎస్ఐలతో మాట్లాడుతున్న ఏఎస్పీ సుస్మిత

చింతలపూడి/లింగపాలెం, నవంబరు7 (ఆంధ్రజ్యోతి): చింతల పూడి పోలీస్‌సర్కిల్ కార్యాలయాన్ని, పోలీస్ స్టేషన్‌లను జంగారెడ్డి గూడెం అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ సుస్మిత శుక్రవారం తనిఖీ చేశారు. ఆయా స్టేషన్ల పరిధిలో సీసీ కెమెరాలు, సైబర్ క్రైం కేసులు, రోడ్డు ప్రమాదాల కేసులు, చీటింగ్ కేసులు, పోక్సో కేసులపై సమీక్ష నిర్వహించారు. అనంతరం లింగపాలెం మండలం ధర్మాజీగూడెం పోలీస్‌స్టేషన్‌ను ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ కె.వెంకన్న, పోలీస్ సిబ్బంది ఆమెకు స్వాగతం పలికారు. పలు కేసుల వివరాలను అడిగి తెలు సుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎవరైనా అసాం ఘిక కార్యకలాపాలకు పాల్పడినా, అక్రమ మద్యం, మత్తు పదార్థాలను ప్రోత్సహించే వారిపై ఉక్కుపాదం మోపుతామన్నారు. పోలీసులు ప్రతి ఒక్కరితో ఫ్రెండ్లీపోలీస్ విధానం అమలు చేయాలని సూచించారు.


కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న దళిత సేన నాయకులు

దళిత సేన నాయకుల ధర్నా

ఏలూరు రూరల్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి):ఇటీవల సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్‌పై జరిగిన దాడి ప్రజాస్వామ్యానికి పెనుముప్పు అని దాడికి పాల్పడిన న్యాయవాదిపై కేసు నమోదు చేసి శిక్షించాలని దళిత సేన వ్యవస్థాపక అధ్యక్షుడు జిజ్జువరపు రవిప్రకాశ్ డిమాండ్ చేశారు. జస్టిస్ గవాయ్‌పై జరిగిన దాడికి నిరసనగా దళితసేన ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గవాయ్‌పై దాడి చేసిన వారిపై సుమోటాగా తక్షణమే కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టరేట్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. నాయకులు కాకర్లమూడి వెంకటరావు, చీలి మోహనరావు, బేతాళ జయసుధ, దిరుసు పాము కృష్ణమూర్తి, డి.పుష్ప పాల్గొన్నారు.


కుక్కునూరులో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

ఓర్వలేక అసత్య ప్రచారాలు : టీడీపీ నాయకులు

కుక్కునూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): కుక్కునూరు టీడీపీ మండల అధ్యక్షుడు ములిశెట్టి నాగేశ్వరరావుపై ఓర్వలేనితనంతో టీడీపీలోని మరొక వర్గం వైసీపీతో కుమ్మక్కై అసత్య ఆరోపణలు చేయిస్తున్నారని టీడీపీ సీనియర్ నాయకులు కోటగిరి సత్యనారాయణ, పులి శ్రీనివాసరావు, బొల్లు కృష్ణార్జునరావు ఆరోపించారు. శుక్రవారం కుక్కునూరులో టీడీపీ నాయకులు విలేకరులతో మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో టీడీపీ కష్టకాలంలో ఉన్న సమయంలో బీసీ నాయకుడిగా, పార్టీ మండల అధ్యక్షుడిగా ములిశెట్టి నాగేశ్వరరావు బాధ్యతలు స్వీకరించారన్నారు. అనంతరం మండలంలో తొమ్మిది పంచాయతీలు గెలిపించడంతో పాటు, ఎంపీటీసీ ఎన్నికల్లో విజయం సాధించి చంద్రబాబుతో శభాశ్ అనిపిం చుకున్నారన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే కొంత మంది పార్టీ మండల అధ్యక్ష పదవిపై కన్నేసి నాగేశ్వరరావును దించివేయాలని అసత్యప్రచారాలు చేస్తున్నారని ఆరోపించారు. ఈ విషయాలను జిల్లా, రాష్ట్ర నాయకుల దృష్టికి తీసుకెళ్తున్నామన్నారు. సమావేశంలో గంజి రాంబాబు, నెగ్గికంటి వెంకన్న, ఉపసర్పంచ్ పిచ్చుక రాజు, శీలం లక్ష్మయ్య, సత్యనారాయణ పాల్గొన్నారు.





ధర్మాజీగూడెంలో క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ.. పెదపాడులో అవగాహన కల్పిస్తున్న వైద్యులు

'స్క్రీనింగ్ పరీక్షలతో క్యాన్సర్ నియంత్రణ సాధ్యం'

జాతీయ క్యాన్సర్ అవగాహన దినం ర్యాలీలు

పోలవరం/పెదపాడు/చింతలపూడి/లింగపాలెం/భీమడోలు, నవంబరు7(ఆంధ్రజ్యోతి): స్క్రీనింగ్ పరీక్షలతో క్యాన్సర్ నియంత్రణ సాధ్యమని డాక్టర్ కె.మురళీధర్ అన్నారు. జాతీయ క్యాన్సర్ అవగాహన దినం సందర్భంగా శుక్రవారం పోలవరంలో పంచాయతీ కార్యాలయం నుంచి ఏటిగట్టు సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానవహారం నిర్వహించారు. వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు. పెదపాడు మండలం పెదపాడు పీహెచ్‌సీ వైద్యులు చక్రధర్, అనంతపాల్ ఆధ్వర్యంలో క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమం, అవగాహన ర్యాలీ, మానవహారం నిర్వహించారు. హెచ్.ఎస్. శ్రీనివాస్, సీహెచ్‌వో రామలక్ష్మి, వేదమణి, పి.శ్రీనివాస్, రాము పాల్గొన్నారు. చింతలపూడి మండలం ఎర్రగుంటపల్లిలో వైద్యాధికారిణి ఇన్‌చార్జి అర్బన్‌హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ గీత ఆధ్వర్యంలో ఆరోగ్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో ఎస్.కె.అబ్రార్ హుస్సేన్, కంభం రమేష్, కూటమి నాయకులు పాల్గొన్నారు. లింగపాలెం మండలం లింగపాలెం, ధర్మాజీగూడెం, కె.గోకవరం గ్రామాల్లోని పీహెచ్‌సీల సిబ్బంది పలు గ్రామాలలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. చింతలపూడి సబ్‌యూనిట్ ఆఫీసర్ ప్రసాద్, డాక్టర్‌లు ప్రియాంక, ఆబీదా, నైమీషా, నిఖిత ర్యాలీలో పాల్గొన్నారు. ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు. భీమడోలు మండలం పూళ్ళ, గుండుగొలను వైద్య కేంద్రాల పరిధిలో, ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాలలో వైద్యులు అరుణజ్యోతి, ప్రదీప్, శరణ్య ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీలు నిర్వహించారు. ఎంపీహెచ్‌వో లక్ష్మణరావు, ఇందిర, పాల్గొన్నారు. ఉంగుటూరు మండలం నారాయణపురంలో మహాత్మాగాంధీ జూనియర్ కళాశాల చేబ్రోలు ప్రాథమిక వైద్య కేంద్రంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. నారాయణపురం గ్రామ సర్పంచ్ రాందే లక్ష్మీసునీత అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి వైద్యులు శ్రావణ్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

'కాళీపట్నపు ఫౌండేషన్ సేవలు అభినందనీయం'



కంప్యూటర్, భోజనం ప్లేట్లు అందజేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

ఏలూరు రూరల్, నవంబరు 7, (ఆంధ్రజ్యోతి):కాళీపట్నపు ఫౌండేషన్ సేవలు అభినందనీయమని కొమడవోలు, రామానగర్ జడ్పీ పాఠశాల హెచ్ఎం రోజ్‌లీన్ అన్నారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో పాఠశాలకు ఆర్వో వాటర్ ప్లాంట్ కంప్యూటర్, సైన్స్ ల్యాబ్‌కు సంబంధించి ఫర్నిచర్, 300 మంది విద్యార్థులకు భోజనం ప్లేట్లు బహూకరించారు. పలువురు వక్తలు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థుల కోసం కాళీపట్నపు ఫౌండేషన్ రెండేళ్లుగా కృషి చేస్తుందన్నారు. అనంతరం ఫౌండేషన్ ఫౌండర్ కాళీపట్నం ఇందు శేఖరరావును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కో-ఆర్డినేటర్ శంకర వెంకటసుబ్బారావు, ప్రకాశరావు, సుబ్రహ్మణ్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

ఏలూరుకార్పొరేషన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 18 మాసాలు గడిచినా భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించకుండా మోసం చేసిందని ఏపీ బిల్డింగ్ అండ్ కనస్ట్రక్షన్స్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు నారపల్లి రమణారావు తెలిపారు. భవన నిర్మాణ కార్మిక సంఘం ఏలూరు జిల్లా కమిటీ సమావేశాన్ని జిల్లా అధ్యక్షులు ఎర్రా రాంబాబు అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కూటమి అధికారంలోకి వస్తే వంద రోజుల్లో సంక్షేమ బోర్డును పునరుద్ధరిస్తామని ఎన్నికల్లో ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈనెల 20న రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో కలెక్టరేట్‌ల వద్ద నిరసన తెలిపేందుకు నిర్ణయించామన్నారు. కొండలరావు, ఆదికృష్ణ, లక్ష్మణరావు, అక్బర్, నాగరాజు, సత్యనారాయణ, కుటుంబరావు, కానూరు రాజు పాల్గొన్నారు.

'అక్టోబరు విప్లవం ఓ నవశకం'

బుట్టాయగూడెం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): దోపిడీ పాలనకు చమరగీతం పలికిన 1917 అక్టోబరు విప్లవం ఓ నవశకమని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఎ.అశోక్ అన్నారు. బుట్టాయగూడెంలోని ఆదివాసీ విజ్ఞాన కేంద్రంలో కార్యవర్గ సభ్యుడు తెల్లం రామకృష్ణ అధ్యక్షతన 'ప్రపంచ పరిణామాల పరిష్కారానికి సోషలిజమే అంతిమ మార్గం' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 1917 అక్టోబరు విప్లవం ప్రపంచ చరిత్రలో నవశకానికి నాంది పలికినట్లు తెలిపారు. జార్ చక్రవర్తుల నియంతృత్వానికి వ్యతిరేకంగా అక్టోబరు విప్లవం సాగిందని, పెట్టుబడిదారీకి వ్యతిరేకంగా సామ్యవాద విప్లవం జరిగిందని తెలిపారు. నాయకులు ఎ.రవి, మొడియం నాగమణి, కారం భాస్కర్, సిరిబత్తుల సీతారామయ్య, పోలోజు నాగేశ్వరరావు, చుండ్రు బుల్లెమ్మ, తామా ముత్యాలమ్మ, తెల్లం సంకురుడు, బొరగం భూచంద్రరావు, గండి గంగరాజు, కారం ముత్యాలరావు పాల్గొన్నారు.


పల్లా శ్రీనివాసరావుకు ఆహ్వానం పలుకుతున్న యాదవ్ సంఘం నాయకులు

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసరావుకు ఆహ్వానం

దెందులూరు,నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : గోపన్నపాలెంలోని పీఈటీ కాలేజీలో యాదవ్ సంఘం ఆధ్వర్యంలో ఈనెల 16న నిర్వహించే కార్తీక వన సమారాధనకు రావాలని ఏపీ టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావును ఏలూరు జిల్లా యాదవ్ సంఘం అధ్యక్షుడు ముమ్మడి చింతయ్య యాదవ్, రాష్ట్ర యువ సమితి నాయకులు కాట్రు బాలు, నాయకులు ఆహ్వాన పత్రికను అందించారు. కార్తీక వనసమారాధనకు వస్తానని ఆయన హామీ ఇచ్చారని యాదవ్ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు తలకొండ జమలయ్య యాదవ్, కార్యదర్శి నున్న లక్ష్మణ్ తెలిపారు. ఏపీ యాదవ్ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ మహేష్ యాదవ్, రాష్ట్ర నాయకులు పిల్లా శ్రీను, మెరుగుమాల శ్రీనివాస్, కూరకుల బుజ్జి తదితరులు ఉన్నారు.


శ్రీవారి ఆలయంలో నటుడు బాలాజీ

శ్రీవారి సేవలో నటుడు బాలాజీ

ద్వారకాతిరుమల, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): చినవెంకన్న ఆలయాన్ని సినీ నటుడు బాలాజీ శుక్రవారం సందర్శించారు. ఆలయానికి విచ్చేసిన ఆయన ముందుగా స్వామి, అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ పండితుల నుంచి వేదాశీర్వచనం, ప్రసాదాలను పొందారు. ఆయనతో పలువురు అభిమానులు ఫొటోలు దిగారు.

పీఎఫ్ రుణాల మంజూరుకు వినతి

ఏలూరుఅర్బన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు నగరపాలక సంస్థ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల్లో పీఎఫ్ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి ఇంతవరకు రుణాలు మంజూరు చేయలేదని నోబుల్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి రాంబాబు అన్నారు. శుక్రవారం ఏలూరులో ఈమేరకు కార్పొరేషన్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ రుణాలు మంజూరు చేయకపోవడం వల్ల ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు.


సాయిబాబా చిత్రపటంతో మేయర్ దంపతులు

హిందూ ముస్లింల ఆధ్యాత్మిక గురువు సాయిబాబా

ఏలూరుటూటౌన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి):హిందూ ముస్లింల ఆధ్యాత్మిక గురువు సాయిబాబా పాదుకలు తమ ఇంటికి రావడం అదృష్టమని మేయర్ షేక్ నూర్జహాన్ అన్నారు. షిరిడిసాయిబాబా ధరించిన పాదుకలు మేయర్ షేక్ నూర్జహాన్ ఇంటికి భక్తులు శుక్రవారం తీసుకొచ్చారు. ఈ సందర్భంగా మేయర్ నూర్జహాన్, ఎస్ఎంఆర్ పెదబాబు దంపతులు మాట్లాడుతూ బాబా వారి పాదుకలు తమ ఇంటికి రావడంతో మా ఇల్లు పావనం అయ్యిందని సంతోషం వ్యక్తం చేశారు. బాబావారి పాదుకలు, చిత్రపటానికి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. షిరిడీ సాయి ప్రేమమందిర్ ఛైర్మన్ ఇసుకపల్లి తాతారావు, కార్పొరేటర్లు కనకనరసింహారావు, ఎస్.శ్రీనివాసరావు, దేవరకొండ శ్రీనివాస్, శామ్యూల్, తదితరులు పాల్గొన్నారు.

లింగపాలెం మండలంలో ఎక్సైజ్ దాడులు

లింగపాలెం, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): ఏలూరు ఎన్‌ఫోర్స్‌మెంట్, ఏలూరు, చింతలపూడి ఎక్సైజ్ అధికారులు సంయుక్తంగా లింగపాలెం మండలం వేములపల్లి, టీసీ హెచ్‌ఆర్‌పాలెం గ్రామాల్లో అక్రమ మద్యం, సారా, బెల్ట్ షాపులు నిర్వహిస్తున్న వారిపై దాడులు నిర్వహించారు. ఎక్సైజ్ సీఐ పి.అశోక్ తెలిపిన వివరాలివి.. వేములపల్లి గ్రామంలో సారా తయారు చేస్తున్న ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకుని 50 లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేసి అతడు వినియోగించిన బైక్‌ను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు. టీసీ హెచ్‌ఆర్‌పాలెంలో సారా కేసులలో నిందితులుగా ఉన్న ముగ్గురు మహిళలను తహసీల్దార్ నజీముల్లాషా వద్ద బైండోవర్ చేశామన్నారు. అదేగ్రామంలో బెల్ట్‌షాపు నిర్వహిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశామన్నారు. దాడులలో ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏఈఎస్ అజయ్‌కుమార్ సింగ్, సీఐ భోగేశ్వరరావు, ఏలూరు ఎక్సైజ్ ఎస్ఐ సుధీర్, చింతలపూడి ఎక్సైజ్ ఎస్ఐలు అబ్దుల్‌ఖలీల్, జగ్గారావు, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కార దిశగా ప్రజాదర్బార్

నూజివీడు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): నూజివీడు నియోజకవర్గ పరిధిలో ప్రజా సమస్యలు తెలుసుకుని పరిష్కరించే దిశగా నూజివీడు క్యాంప్ కార్యాలయంలో ప్రజా సమస్యలపై అర్జీలు స్వీకరిస్తున్నట్టు రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి తెలిపారు. ప్రతి గురు, శుక్రవారాల్లో నియోజకవర్గం పరిధిలోని భూ సంబంధ, అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందడంలో జాప్యం, ఇతర సమస్యల పరిష్కారానికి సంబంధించి అర్జీలు స్వీకరించి పరిష్కార దిశగా చర్యలు చేపడతామన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ముదినేపల్లి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి, కొత్తపల్లి సబ్ స్టేషన్ల పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 8 నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్టు ఏఈ పూర్ణచంద్రరావు తెలిపారు. పెయ్యేరు, దాకరం, ముదినేపల్లి, పేరూరు, గురజ, వడాలి, కోమర్రు, వైవాక, దేవపూడి, అల్లూరు, ప్రొద్దువాక గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు.

చట్టాలను తెలుసుకోవాలి

మండవల్లి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): చట్టాలపై అవగాహన పెంచుకుని జీవితాన్ని విద్యార్థి దశ నుంచే ఉన్నతిగా మలుచుకోవాలని కైకలూరు సీనియర్ సివిల్ జడ్జి వీవీఎన్వీ లక్ష్మి పేర్కొన్నారు. మండలంలోని లోకుమూడి వికాస్ జూనియర్ కళాశాలలో శుక్రవారం మండల లీగల్ సర్వీసెస్ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. సైబర్ నేరాలపై అవగాహనతో మెలగాలని కోరారు. ఆవేశంలో గొడవలు పడినా రాజీమార్గంతో గొడవలకు స్వస్తి పలకాలని తెలిపారు. ఇందులో లాయర్లు పవన్ కాంత్, శివప్రసాద్, వికాస్ ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

లీగల్ సర్వీసెస్ అథారిటీతో న్యాయ సహాయం

నూజివీడు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): పేదలకు ఉచిత న్యాయ సహాయం అందించేందుకు లీగల్ సర్వీసెస్ యాక్టును అమల్లోకి తీసుకు రావడం జరిగిందని 15వ అదనపు జిల్లా జడ్జి ఎ. నాగశైలజ అన్నారు. శుక్రవారం న్యాయ సేవా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆమె మాట్లాడుతూ లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో పేద వర్గాల కేసులను ఉచితంగా వాదించేందుకు న్యాయవాదులను నియమించడం జరుగుతుందన్నారు.

ప్రపంచ గతిని మార్చిన సోషలిస్టు విప్లవం

నూజివీడు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): సోషలిస్టు విప్లవం ప్రపంచ గతిని మార్చిందని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ పేర్కొన్నారు. శుక్రవారం పోతిరెడ్డిపల్లిలో సీపీఐ గ్రామశాఖ ఆధ్వర్యంలో గ్రామ ఎర్రదిమ్మ కూడలి సెంటర్లో ఎర్రజెండాను ఆమె ఆవిష్కరించి మాట్లాడుతూ పలు దేశాలలో సోషలిస్టులు, కమ్యూనిస్టులు అధికారంలోకి రావడానికి విప్లవం దోహదం చేసిందన్నారు. సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు చలసాని వెంకట రామారావు, ఏలూరు జిల్లా సహాయ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు, సీపీఐ సీనియర్ నాయకులు కొమ్మన నాగేశ్వరరావు, నూజివీడు నియోజకవర్గ కార్యదర్శి నిమ్మగడ్డ నరసింహ పాల్గొన్నారు.

జాతీయ స్థాయిలో యుక్తశ్రీ ప్రతిభ



నూజివీడు టౌన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): నూజివీడుకు చెందిన ఆర్చరీ క్రీడాకారిణి కొండ పావులూరి యుక్తశ్రీ జాతీయ ఆర్చరీ పోటీల్లో ప్రథమ స్థానం సాధించింది. హర్యానా రాష్ట్రంలోని సోనిపట్‌లో ఏషియా ఆర్చరీ క్రీడా పోటీలకు సంబంధించి స్టేజ్ 3 జూనియర్స్ ఎన్నిక పోటీలను ఇటీవల నిర్వహించారు. ఈ పోటీలలో నూజివీడుకు చెందిన యుక్తశ్రీ ప్రథమ స్థానం సాధించింది. నూజివీడుకు చెందిన ఆటో మొబైల్స్ ఫైనాన్స్ సంస్థను నడుపుతున్న కొండపావులూరి గిరిబాబు కుమార్తె యుక్తశ్రీ ప్రస్తుతం విజయవాడలో ట్వెల్త్ స్టాండర్డ్ చదువుతోంది.

రాష్ట్రస్థాయి పోటీలకు మీర్జాపురం విద్యార్థులు

నూజివీడు టౌన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి బేస్‌బాల్, సాఫ్ట్‌బాల్ క్రీడా పోటీలకు నూజివీడు మండలం మీర్జాపురం జడ్పీ హైస్కూల్ విద్యార్థులు ఎన్నికైనట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయిని కోనేరు శ్రీదేవి తెలిపారు. గూడూరు జడ్పీ హైస్కూలులో గురువారం నిర్వహించిన సీనియర్ సాఫ్ట్‌బాల్ పోటీల్లో చల్ల అబి, జూనియర్ విభాగంలో కె. గోపి, బేస్‌బాల్‌లో ఎన్. నవీన్, పులపాక జగన్, బాలికల విభాగంలో బి. అనూష రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపికయ్యారన్నారు.

కలిదిండి: రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఆరుతెగలపాడు జడ్పీ పాఠశాల విద్యార్థులు పి.కార్తీక్, పి.జశ్వంత్ ఎంపిక య్యారని ప్రధానోపాధ్యాయుడు అనిశెట్టి శ్రీనివాస్ తెలిపారు. గుడివాడలో ఈ నెల 5న జిల్లాస్థాయి అండర్-14 బాలుర విభాగంలో జరిగిన పోటీల్లో ప్రతిభ చూపారన్నారు. ఎస్ఎంసీ ఛైర్మన్ కె.లక్ష్మణరావు, హెచ్ఎం అనిశెట్టి శ్రీనివాస్, పీడీ జి.రవిబాబు విద్యార్థులను అభినందించారు.

మండవల్లి: మండవల్లి జడ్పీ హైస్కూల్ విద్యార్థులు రాష్ట్రస్థాయి స్కిల్ కాంపిటీషన్‌కు ఎంపికైనట్లు హెచ్ఎం శ్రీనివాసరావు తెలిపారు. ఏలూరులో జిల్లాస్థాయి పోటీల్లో మండవల్లి విద్యార్థులు విశేష ప్రతిభ చూపినట్లు వివరించారు. ఎంపికైన విద్యార్థులను శిక్షకులు, హెచ్ఎం అభినందించారు.

ఆగిరిపల్లి: హీల్ స్కూల్ విద్యార్థులు వివిధ ఆటల పోటీల్లో కృష్ణాజిల్లా జట్టుకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ వై లతాచౌదరి తెలిపారు. ఈ నెల 5న గుడివాడలో నిర్వహించిన పోటీల్లో అండర్-19 విభాగం అథ్లెటిక్స్‌లో కె. లక్ష్మీధర్, బి. పవన్, వి. కిషోర్‌లు ఎంపిక కాగా, 800, 3000 వేల మీటర్ల పరుగు పందెం, వాలీబాల్ పోటీలో అండర్-17 విభాగంలో వి. అలేఖ్య ఎంపికైనట్టు తెలిపారు. వీరు రాష్ట్రస్థాయి పోటీలో కృష్ణా జిల్లా తరపున ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. హీల్ వ్యవస్థాపక అధ్యక్షులు డా.కోనేరు సత్యప్రసాద్ తదితరులు విద్యార్థులను అభినందించారు.

పంట కాలువల్లో వ్యర్థాలను నివారించాలి

కైకలూరు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): పంటకాలువల్లో వ్యర్థాలు వేయకుండా ప్రజలు సహకరిస్తే స్వచ్ఛమైన తాగునీరు అందిస్తామని డీసీ ఛైర్మన్ పొత్తూరి వాసురాజు అన్నారు. శుక్రవారం ఆటపాకలో కైకలూరు పంటకాలువలోని చెత్త తొలగింపు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంటకాలువల్లో వ్యర్థాలను వేయడం వలన నీరు కలుషితం అవుతుందని ఈ నీటిని తాగితే ప్రజారోగ్యాలు దెబ్బతింటాయన్నారు. కాలువల ప్రక్షాళనతో శివారు గ్రామాలకు తాగు, సాగునీరు పూర్తిస్థాయిలో అందుతాయన్నారు. నీటి సంఘాల అధ్యక్షులు కన్నా ముసలయ్య, కూటమి నేతలు ముదునూరి కొండరాజు, ఉపసర్పంచ్ బావిశెట్టి నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.


పోలీసులకే సవాల్ విసిరిన నేరస్తుడి అరెస్టు

ఏలూరు క్రైం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): గంజాయి, వ్యసనాలకు బానిసలైన యువకులు మోటారు సైకిళ్ల తాళాలు పగులగొట్టి వాటిని తస్కరించి వాటితోనే నేరాలు చేస్తున్నారు. అంతేకాక ఏకంగా పోలీసులకే ఒక దొంగ సవాల్ విసిరాడు. 'తాను డ్యూక్ బైక్ తస్కరించానని తనపై రెండు కేసులు ఉన్నాయని వంద బైక్‌లు దొంగతనం చేశానని దమ్ముంటే నన్ను పట్టుకోండి, అని ఏం చేస్తారో చేసుకోండి' అంటూ సవాల్ విసిరాడు. ఈ విధంగా సవాల్ చేసిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఏలూరు జిల్లా ఎస్పీ కిశోర్ ఆదేశాలతో నూజివీడు టౌన్ సీఐ పి.సత్య శ్రీనివాస్ ఆధ్వర్యంలో ప్రత్యేక పోలీస్ బృందం ఆ వీడియో ఆధారంగా శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి ఈ నెల 6న నూజివీడు రామానుగూడెం రోడ్డులో డంపింగ్ యార్డు వద్ద ఐదుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. పోలీసు లకు సవాల్ విసిరిన నూజివీడు పట్టణంలో రెల్లిపేటకు చెందిన దళాయి గణేష్ అలియాస్ నాగపవన్ గణేష్‌తోపాటు నూజివీడులోని గాంధీనగర్‌కు చెందిన షేక్ మెహర్ బాబా, నూజివీడు మండలం గొల్లపల్లికి చెందిన చౌటపల్లి శుభాష్ అలియాస్ సుబ్బు, నూజివీడులోని ఎంఆర్ అప్పారావు కాలనీకి చెందిన షేక్ ఆసిఫ్ ఉల్లా అలియాస్ ఆసీఫ్, చిత్తూరి అజయ్‌కుమార్ అలియాస్ అజయ్ లను అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి సుమారు రూ.9.08 లక్షల విలువైన 12 మోటారు సైకిళ్లు స్వాధీనం చేసుకున్నారు.

గణేశ్‌ను ప్రశ్నించిన ఎస్పీ..

ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం మధ్యాహ్నం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా ఎస్పీ కిశోర్ అక్కడ ఉన్న నేరస్తుడు దళాయి గణేష్‌ను ప్రశ్నించారు. పోలీసులకు ఏ విధంగా సవాల్ విసిరావో మరోసారి చెప్పు అనగానే గణేష్‌కు చుక్కలు కనిపించాయి. తాగిన మైకంలో మాట్లాడానని తప్పయిందంటూ ఇంకెప్పుడు అలా మాట్లాడనని.. నేరాలు చేయనంటూ ఒప్పుకోలు మొదలు పెట్టాడు. నేరస్తులను అరెస్టు చేయడంలో ప్రతిభ కనబర్చిన పోలీసు అధికారులకు ప్రశంసా పత్రాలను అందించారు. అదనపు ఎస్పీ ఎన్. సూర్య చంద్రరావు, నూజివీడు డీఎస్పీ ప్రసాద్ పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	125, 134, 145
చికెన్ విత్ స్కిన్	240
చికెన్ స్కిన్‌లెస్	250
నెక్ కోడి గుడ్డు ధర (100)	
విజయవాడ జోన్ రైతు ధర రూ.475	



ఆరుతెగలపాడు జడ్పీ హైస్కూల్ విద్యార్థులతో కలసి ఎమ్మెల్యే కామినేని వందేమాతరం గీతాలాపన



కైకలూరు ఓరియంటల్ హైస్కూల్లో ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ వందేమాతరం గీతాలాపన



వందేమాతరం 150 అక్షర క్రమంలో ఒదిగిన త్రివిధ విద్యార్థులు

మార్మోగిన వందేమాతరం

ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల్లో వందేమాతరం గీతాలాపన

కలిదిండి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): దేశాన్ని మేల్కొల్పిన జాతీయ గీతం వందేమాతరమని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ అన్నారు. వందేమాతర గేయం 150 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆరుతెగలపాడు జడ్పీ హైస్కూల్‌లో శుక్రవారం సుమారు 600 మంది విద్యార్థులు పాల్గొని వందే మాతరం గీతాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బంకిం చంద్ర ఛటర్జీ రాసిన ఈ గేయం భారతదేశాన్ని ఉద్యమ స్ఫూర్తితో ముందుకు నడిపించిందన్నారు. ఏఎంసీ మాజీ ఛైర్మన్ వల్లభనేని శ్రీనివాస్ చౌదరి, డీసీ ఛైర్మన్ ముద్దం భోగేశ్వరరావు, జనసేన నాయకులు నల్లగోపుల చలపతిరావు, కొల్లి బాబీ, నల్లజర్ల సత్యనారాయణ, బీజేపీ మండల అధ్యక్షుడు అంకాల దుర్గా ప్రసాద్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు చిట్టూరి రవీంద్ర, కాళ్లపాలెం సర్పంచ్ స్వర్ణకుమారి, ఎంఈవో అనిశెట్టి శ్రీనివాస్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కైకలూరు: గ్రామగ్రామాన వందేమాతరం గీతాలాపన మార్మోగింది. శుక్రవారం కైకలూరు మండలంలోని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల్లో వందేమాతరం గీతాన్ని ఆలపించారు. వందేమాతరం రచించి 150 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా కేంద్రప్రభుత్వం ఇచ్చిన పిలుపు మేరకు గీతాలాపన జరిగింది. కైకలూరు జడ్పీ ఓరియంటల్ హైస్కూల్లో ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ పాల్గొన్నారు. కైకలూరు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అడవి కృష్ణ, ఆధ్వర్యంలో గీతాలాపన జరిగింది. జిల్లాపరిషత్ ఓరియంటల్ స్కూల్లో రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ పీజేఎస్ మాల్యాద్రి, టీడీపీ కైకలూరు పట్టణ మాజీ అధ్యక్షుడు ఎండీ జానీ, వేములపల్లి కారుణ్య, మైనార్టీ నాయకులు ఎండీ ఉస్మాన్, జనసేన నాయకుడు మైగాపుల రామాంజనేయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముదినేపల్లి: శుక్రవారం ముదినేపల్లిలోని వికాస్ జూనియర్ కళాశాలలో విద్యార్థులు వందేమాతరం గీతాలాపన చేశారు. ఎంపీడీవో వై.రామకృష్ణ, డిప్యూటీ ఎంపీడీవో బి.అశోక్, కళాశాల కరస్పాండెంట్ మదన్ కిషోర్, ప్రిన్సిపాల్స్ మోహనరావు, కొత్తూరు వెంకట సుబ్బారావు తదితరులు వందేమాతర గీతం విశిష్టతను వివరించారు. ముదినేపల్లి జడ్పీ హైస్కూలు విద్యార్థుల గీతాలాపన చేశారు. హెచ్ఎం విజయకుమార్ పాల్గొన్నారు. ఎంఈవోలు డి.రామారావు, కె.నరేష్ కుమార్ ఆధ్వర్యంలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో వందేమాతరం గీతాలాపన జరిగింది. ముదినేపల్లి ఎస్‌పీఎం ఐటీఐలో ప్రిన్సిపాల్ సత్య నారాయణ, వైస్ ప్రిన్సిపాల్ కె హరిత ఆధ్వర్యంలో విద్యార్థులు వందేమాతరం ఆలపించారు.

నూజివీడు టౌన్: వందేమాతరం నినాదం జాతీయ సమైక్యతకు నిదర్శనమని నూజివీడు ఎంపీడీవో చెన్న రామవేంద్రనాథ్ అన్నారు. నూజివీడు ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలో సర్పంచులు, ఎంపీటీసీలతో ప్రతిజ్ఞ చేయించారు. త్రివిధ పాఠశాల విద్యార్థులు వందేమాతరం 150గా ఒదిగి ఆకట్టుకున్నారు.



సగ్గూరులో క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ

అవగాహనతోనే క్యాన్సర్ దూరం

కలిదిండి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): జాతీయ క్యాన్సర్ అవగాహన దినం సందర్భంగా కలిదిండిలో శుక్రవారం వైద్యాధికారులు క్యాన్సర్‌పై అవ గాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు మాట్లాడు తూ క్యాన్సర్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. మహిళల్లో రొమ్ము, గర్భాశయ క్యాన్సర్‌లు వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుందన్నారు. మొదటి దశలో గుర్తిస్తే క్యాన్సర్‌ను నివారించుకోవచ్చన్నారు. గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి క్యాన్సర్ పరీక్షలు చేస్తున్నామన్నారు. నిర్లక్ష్యం చేస్తే ఈ మహమ్మారి ప్రాణాంతకంగా మారుతుందన్నారు. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ కృష్ణ కిషోర్, వైద్యాధి కారులు నాగమణి, వెంకటలక్ష్మి, రాంబాబు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ముదినేపల్లి: క్యాన్సర్‌పై యువత అవగాహన పెంచుకోవాలని గురజ పీహెచ్‌సీ హెల్త్ ఎడ్యుకేటర్ కె. జోనాథన్ అన్నారు. శుక్రవారం ముదినేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఎస్ఆర్ డిగ్రీ కళాశాలల్లో ప్రిన్సిపాల్ ఓరుగంటి సత్యనారాయణమూర్తి అధ్యక్షతన క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జోనాథన్ మాట్లాడుతూ పర్యావరణ కాలుష్యం, ధూమపానం, అధికంగా మద్యం సేవించడం, ఒత్తిడి, నిద్రలేమి వల్ల హార్మోన్లలో మార్పులు వచ్చి క్యాన్సర్ కణాలు పెరుగుతాయని తెలిపారు. నిరంతర అలసట, అకారణంగా రక్తస్రావం, నిలకడైన దగ్గు, గొంతునొప్పి లాంటి కారణాలను గుర్తిస్తే వెంటనే ప్రభుత్వ ఆసుపత్రిలో క్యాన్సర్ పరీక్షలు చేయించుకోవాలని కోరారు. కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆగిరిపల్లి: క్యాన్సర్‌పై అందరూ అవగాహన కలిగి ఉండాలని ఆగిరిపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ జగన్‌మోహన్‌రావు అన్నారు. పీహెచ్‌సీ సిబ్బందితో క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించి, క్యాన్సర్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు. వైద్యాధికారిణిలు డాక్టర్ మంజుల, డాక్టర్ సునంద, సిబ్బంది పాల్గొన్నారు.

పూజలు, వనసమారాధన



ముదినేపల్లి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): వడాలిలోని అన్న పూర్ణా సమేత విశ్వేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం కార్తీక వనసమారాధన వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయ ఈవో సింగనపల్లి శ్రీనివాసరావు విశ్వేశ్వరుడికి పూజలు నిర్వహించి అన్నసమారాధన ప్రారంభించారు. కార్తీక మాసం సందర్భంగా మహిళలు దేవస్థానం వద్ద దీపాలను వెలిగించి పూజలు జరిపారు. విశ్వేశ్వర స్వామికి తులసీ దళాల దండలతో అర్చనలు జరిపారు.

టీడీపీ నాయకుడు సుబ్బరాజు హఠాన్మరణం



ఆగిరిపల్లి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): సురవరం గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు, మండల తెలుగు రైతు మాజీ అధ్యక్షుడు కోనూరి సుబ్బరాజు (60) శుక్రవారం గుండెపోటుతో మృతి చెందినట్టు టీడీపీ మండల అధ్యక్షుడు నక్కనబోయిన వేణు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో పార్టీ అభివృద్ధికి సుబ్బరాజు పాటుపడ్డారని అన్నారు. ఆయన భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పలువురు టీడీపీ నాయకులు ఆయన భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.

పేకాట శిబిరంపై దాడి

ముదినేపల్లి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): పోల్‌రాజ్ కెనాల్ వద్ద నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై గురువారం రాత్రి పోలీసులు దాడి చేసి 10 మంది జూదరులను అరెస్టు చేశారు. ఎస్ఐ వీరభద్రరావు పోలీస్ సిబ్బందితో కలసి నిర్వహించిన ఈ దాడిలో జూదరుల నుంచి రూ. 16,840 నగదు స్వాధీనం చేసుకున్నారు.



బాల్య వివాహాలు జరిపితే కఠిన చర్యలు : సబ్ కలెక్టర్

నూజివీడు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాల నిషేధ చట్టం అమల్లోకి వచ్చి 20 ఏళ్లు దాటినా బాల్య వివాహాలు జరగడంపై అధికారులు కఠినంగా వ్యవహరించాలని నూజివీడు సబ్ కలెక్టర్ బి. వినూత్న ఆదేశించారు. శుక్రవారం నూజివీడు సబ్ కలెక్టర్ కార్యాలయంలో డివిజన్ స్థాయి సమావేశాన్ని నిర్వహించి మాట్లాడుతూ స్టాట్యుటరీ కమిటీ సమావేశాలు సక్రమంగా జరగకపోవడం వల్ల బాల్య వివాహాల సంఖ్య పెరుగుతుందన్నారు. బాల్య వివాహాలు జరిపితే వధూవరుల తల్లిదండ్రులపై కేసులు నమోదు చేసి కఠినంగా వ్యవహరించాలన్నారు. కొందరు నకిలీ సర్టిఫికెట్లును సృష్టించి వయస్సు నిర్ధారణ చేస్తున్నారన్నారు. అలా నకిలీ సర్టిఫికెట్లును సృష్టించిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. నూజివీడు సీడీపీవో విజయ కుమారి తో పాటు డివిజన్‌లోని తహసీల్దార్‌లు, ఎంపీడీవోలు, పోలీస్, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

రహదారి అభివృద్ధి చేయాలని సీపీఐ పాదయాత్ర



ముసునూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఏలూరుకు నూజివీడు వయా ముసునూరు మీదుగా వెళ్లే ప్రధాన రహదారిని అభివృద్ధి చేయాలంటూ సీపీఐ నూజివీడు సమితి ఆధ్వర్యంలో శుక్రవారం పాదయాత్ర నిర్వహించారు. నూజివీడు మండలం పోతిరెడ్డిపల్లి అమరవీరుల స్తూపం వద్ద పాదయాత్రను ఏలూరు జిల్లా సీపీఐ కార్యదర్శి మనవ కృష్ణచైతన్య ప్రారం భించారు. ఈ పాదయాత్ర సింహాద్రిపురం, ముసునూ రు గ్రామాల మీద గోపవరం సెంటర్ వరకు నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల కూడళ్లలో జరిగిన సభల్లో సీపీఐ నాయకులు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ధ్వంసమైన రహదారులు వల్ల ప్రజలు అనేక ఇబ్బందులు పడ్డారని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా ప్రజలకు రహదారుల ఇబ్బందులు తప్పడం లేదన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి ఈ రహదారిని అభివృద్ధి చేయకపోతే భవిష్యత్‌లో నిరాహార దీక్షలు చేయడంతో పాటు ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని సీపీఐ నేతలు హెచ్చరించారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అక్కినేని వనజ, రాష్ట్ర సమితి సభ్యుడు చలసాని వెంకట రామారావు, ఏలూరు జిల్లా సీపీఐ సహాయ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు, నాయకుడు కొమ్మన నాగేశ్వరరావు, నియోజకవర్గ కార్యదర్శి నిమ్మగడ్డ నరసింహ నేతృత్వంలో పాదయాత్ర సాగింది.



పారిశుధ్యం మెరుగుపరచాలి

నూజివీడు టౌన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): పారిశుధ్య మెరుగుదలకు కలిసికట్టుగా చర్యలు చేపట్టాలని నూజివీడు మున్సిపల్ కమిషనర్ పీరయ్య అన్నారు. శుక్రవారం నూజివీడు మున్సిపల్ కార్యాలయం వద్ద మున్సిపల్ పారిశుధ్య కార్మికులతో ఆయన సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూజివీడు మున్సిపాలిటీ సంపూర్ణ పారిశుధ్య పట్టణంగా తీర్చిదిద్దేందుకు పారిశుధ్య కార్మికులు కృషి చేయాలన్నారు. నూజివీడు మున్సిపల్ వైస్‌ఛైర్మన్ పగడాల సత్యనారాయణ, మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు రామిశెట్టి మురళీకృష్ణ, సీఐటీయూ కార్యదర్శి జి. రాజు తదితరులు పాల్గొన్నారు.



ఘనంగా ఆలయ పునః ప్రతిష్ఠ

కైకలూరు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి ఆలయ పునఃప్రతిష్ఠ వైభవోపేతంగా నిర్వహించారు. శుక్రవారం వరహాపట్నంలోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ, శిఖర, ధ్వజ ప్రతిష్ఠ జరిగింది. ఎమ్మెల్యే డాక్టర్ కామినేని పూజలను నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లును నిర్వహించారు. అనంతరం అఖండ అన్నసమారాధన జరిగింది.

దళారులదే రాజ్యం!

(5వ పేజీ తరువాయి)

ఉండడంపై తీవ్ర దుమారం రేగింది. కొంత మంది ఉన్నతస్థాయిలో ఫిర్యా దులు చేశారు. దీనిపై విచారణలను పూర్తి చేసిన ఉన్నతాధికారులు సబ్ రిజిస్ట్రార్‌తో పాటు, కింద స్థాయి సిబ్బందిని చాలావరకు వివిధ ప్రాంతాలకు బదిలీ చేశారు. భీమడోలు లోను పాత సిబ్బంది అక్కడ తిష్టవేసి అక్రమ లావాదేవీలను నిర్వహిస్తున్నారన్న ఆరోపణ లు రాగా జిల్లా రిజిస్ట్రార్ కె.శ్రీనివాసరావు స్వయంగా రికార్డులను పరిశీలించి, అక్కడ సిబ్బందికి హెచ్చరికలు జారీ చేశారు. ఎవరికి లంచాలు ఇవ్వనక్కర్లేదని బహిరంగంగానే ప్రకటించారు.

అధికారులకు ప్రైవేట్ సిబ్బంది

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు అవినీతికి అడ్డాగా మారాయి. కొందరు అధికారులు ఇష్టా రాజ్యంగా వ్యవహరిస్తున్నారు. దళారీ వ్యవస్థను ప్రోత్సహిస్తూ.. అడ్డగోలు వ్యవహారాలతో జేబులు నింపుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. కొందరు అధికారులు వసూళ్ల కోసమే ప్రత్యేకంగా సిబ్బంది నియమించుకున్నారంటే పరిస్థితి ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. ఫిర్యాదులు అందిన సమయం లో అడపాదడపా విచారణలు జరిపి వదిలేస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. ఉన్నతాధికారులు కఠిన చర్యలు తీసుకుంటే వీరి ఆగడాలకు అడ్డుకట్ట పడుతుందని పలువురు కోరుతున్నారు.

వీటి సంగతి ఇంతేనా?

(5వ పేజీ తరువాయి)

స్థిరీకరణ జరిగితే ఏ పంట కాల్వల కింద ఎంత ఆయకట్టులో వరి సాగు, వేరుశనగ సాగు జరుగుతున్నదీ, ఎంత ఆయకట్టులో ఆక్వా సాగు జరుగుతున్నదీ నమోదై సాగునీటిని ఏయే కాల్వకు ఎంత పరిమాణంలో విడుదల చేయాలో తెలుస్తుంది. ఆ లెక్కలు లేక నోటిపై అయిన ఆయకట్టుకే అధికారులు నీరు విడుదల చేస్తున్నారు.

శిస్తులు మామూలే

నోటిఫైడ్ పంట కాల్వల కింద సాగు చేస్తున్న రైతులతో పాటే నాన్ - నోటిఫైడ్ కాల్వల కింద సాగు చేస్తున్న రైతులూ నీటి తీరువా చెల్లిస్తున్నారు. నాన్ - నోటిఫైడ్ కాల్వలను నోటిఫై చేయాలని గత 50 ఏళ్లుగా రైతులు ప్రభుత్వాలకు చేసిన విజ్ఞప్తులు బుట్టదాఖలు అయ్యాయే తప్ప కైకలూరు నియోజకవర్గంలోని ఒక నాన్ - నోటిఫైడ్ పంట కాల్వ కూడా నోటిఫై కాలేదు.

మొక్కలు నాటిన అధికారులు

కైకలూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): అటపాకలో చెత్తకుప్పలు వద్దు చెట్లు ఎంతో మేలు అనే కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఇటీవల జిల్లా పంచాయతీ అధికారి కె అనూరాధ ఏర్పాటుచేసిన చెత్తకు ప్పలు వద్దు చెట్లు ఎంతో మేలు అనే కార్యక్రమం ద్వారా రహదా రుల వెంబడి ఖాళీ ప్రదేశాల్లో చెత్త కుప్పలను తొలగించి ఆ ప్రాంతాల్లో మొక్కలను నాటారు. మొక్కలు విరివిగా పెంచడం వలన ఆహ్లాదకరమైన వాతావరణం ప్రజా ఆరోగ్యానికి ఎంతో మేలు జరుగుతుందని పంచాయతీ కార్యదర్శి ఎం రవికిరణ్ అన్నారు.